జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.

ప్రతి వాలంటీర్ కు

నెలకు Rs.25,000/-

Salary ఇవ్వబడును.

విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.

ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా

మీ ప్రాంతంలో ఉన్న పార్స్ లీడర్స్ ని సంప్రదించవచ్చు.

లేదా ఈ క్రింది నెంబర్

7660027683 కి వాట్సాప్ చేయగలరు.

సంపుటి 15 సంచిక 263 విశాఖపట్నం | సోమవారం 22 మే 2023 | 8 పేజీలు | వెల : 5.00

## కొత్త పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలి రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : కొత్త పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలని, ప్రధాని కాదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానిం చారు. ఈ నెల 28న పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోడీ ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. ప్రధాని ప్రారంభోత్సవంపై ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. పైగా పార్లమెంట్ భవనాన్ని హిందూత్వ సిద్ధాంతకర్త విడి. సావర్కర్ జయంతి అయిన మే 28న ప్రారంభించడం ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. కొత్త భవనాన్ని 'ప్రధాని వానిటీ ప్రాజెక్ట్' గా కాంగ్రెస్ అభివర్ణించింది. పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభించాలని, ప్రధాని కాదని రాహుల్‌గాంధీ అన్నారు. కొత్త భవనం ప్రారంభోత్సవ ప్రకటన తర్వాత, కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేష్ భద్రతా టోపీతో ఉన్న ప్రధానమంత్రి చిత్రాన్ని పంచుకున్నారు. మే 28న కొత్త భవనాన్ని ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు, కార్మికులు మాత్రమే ప్రారంభిస్తారని ట్వీట్‌లో తెలిపారు. ఇది అతని వ్యక్తిగత ప్రాజెక్ట్ అని చిత్రాన్ని చూస్తే అర్థమౌతోందని అన్నారు. గాంధీ, నెహ్రూ, పటేల్, బోస్ మరియు డా. అంబేద్కర్‌ను పూర్తిగా తిరస్కరించడమని అన్నారు. పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ప్రధానిని ఎందుకు ఆహ్వానించారు? ప్రధానమంత్రి ప్రభుత్వానికి అధిపతి, శాసనసభకు కాదు. ప్రజల సొమ్ముతో కట్టిన భవనాన్ని ప్రధాని తన స్నేహితుడి సొమ్ముతో కట్టినట్లు వ్యవహరిస్తున్నారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రధాని ఎందుకు ప్రారంభిస్తారని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ ప్రారంభించాలని అన్నారు.

## బిజెపి నేతలెవరూ ఉగ్రవాదుల దాడిలో మరణించలేదు : సిద్ధరామయ్య



బెంగుళూరు : బిజెపి, ప్రధాని మోడీపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీ ఎప్పుడు విదేశీ పర్యటనలకు వెళ్లినా ఉగ్రవాదంపై పోరాడుదాం అంటూ ప్రసంగాలు చేస్తారని, ఇప్పటివరకు బిజెపి నేతలెవరూ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోలేదని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్థంతి సందర్భంగా బెంగళూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె. శివకుమార్‌లు నివాళులు అర్పించారు. అనంతరం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై బిజెపి నేతలు విషం చిమ్ముతున్నారని అన్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయినా .. కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని ఆరోపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఉగ్రవాదంపై తమ పార్టీ మొదటి నుండి పోరాడుతోందని అన్నారు. బిజెపి ఉన్నంత కాలం సమాజంలో శాంతి, సామరస్యాలు ఉండవని ధ్వజమెత్తారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులు ఆందోళనల మధ్య జీవిస్తున్నారని మండిపడ్డారు.

## హీరోషిమా అణుదాడి మృతులకు నివాళులు అర్పించిన ప్రధాని



హీరోషిమా : జి7 ఆహ్వానిత దేశాల నేతలతో కలిసి ప్రధాని మోడీ ఆదివారం జపాన్‌లోని హీరోషిమా పీస్ మెమోరియల్ పార్క్‌లో నివాళులర్పించారు. హీరోషిమా బాధితులకు నివాళులు అర్పించేందుకు వెళుతున్న సమయంలో ప్రధాని మోడీ ఆస్ట్రేలియాలో ఆంథోనీ అల్బనీస్‌తో కొద్ది సేపు సంభాషిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. హీరోషిమాలో జరగనున్న జి7 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోడీ జపాన్ వెళ్లిన సంగతి తెలిసిందే. జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా ఆహ్వానం మేరకు ప్రధాని తూర్పు ఆసియా దేశాన్ని సందర్శిస్తున్నారు. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, కొమొరోస్, కుక్ దీవులు, ఇండోనేషియా, దక్షిణ కొరియా మరియు వియత్నాం నేతలను ఆహ్వానించింది. మొదటి రోజు హీరోషిమాలో జాతి పిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జి7 దేశాల సమావేశంలో పాల్గని ప్రధాని ప్రసంగించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ సమావేశమయ్యారు. రెండోరోజు జపాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. హీరోషిమాలో సుమారు 78 ఏళ్ల క్రితం అణుబాంబు దాడి జరిగింది. ఆ ప్రదేశానికి ప్రధాని మోడీ జి7 దేశాల నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హీరోషిమా పీస్ మెమోరియల్ వద్ద అణుబాంబు దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. ఆ తరువాత పీస్ మెమోరియల్ మ్యూజియాన్ని సందర్శించారు. అక్కడ డాక్యుమెంట్ చేయబడిన ఎగ్జిబిట్ లను పరిశీలించి, సందర్శకుల పుస్తకంపై మోడీ సంతకం చేశారు. ప్రధాని మోదీతో పాటు పీస్ మెమోరియల్ మ్యూజియాన్ని సందర్శించిన వారిలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా కూడా ఉన్నారు. నేడు బ్రిటన్ ప్రధాని రిషి సునక్‌ను కలుసుకోనున్నారు. అనంతరం భారతదేశ పసిఫిక్ దీవుల సహకార సదస్సులో పాల్గొనడానికి పపువా న్యూ గినియాకు వెళ్లనున్నారు.

## సూడాన్ లో ఏడు రోజుల పాటు కాల్పుల విరమణ



ఖార్టూమ్ : యుద్ధ ప్రభావిత సూడాన్‌లో ఏడు రోజుల పాటు కాల్పుల విరమణ ప్రకటించారు. మే 22 నుంచి మే 29 వరకు కాల్పుల విరమణ కొనసాగనుంది. ఖార్టూమ్‌లో భారీ పోరాటాలతో, ప్రత్యర్థి పక్షాలు మే 22 సాయంత్రం నుండి ఏడు రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నాయని అమెరికా మరియు సౌదీ అరేబియాలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి. శనివారం ఇరు దేశాలు జెడ్డాలో చర్చలు జరిపిన అనంతరం ఈ ప్రకటన విడుదల చేశాయి. కాల్పుల విరమణ "ఏడు రోజుల పాటు అమల్లో ఉంటుందని, ఇరు పక్షాలు ఒప్పందాన్ని పొడిగించవచ్చు " అని ఆ ప్రకటనలో పేర్కొంది. ఐదు వారాల క్రితం హింస ప్రారంభమైనప్పటి నుండి ప్రకటించిన కాల్పుల విరమణను అనేకసార్లు ఉల్లంఘించారని సౌదీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. రాజధాని ఖార్టూమ్‌లో శనివారం భీకర వైమానిక దాడులు జరిగిన సంగతి తెలిసిందే. సూడాన్‌లో గత కొన్ని రోజులుగా సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఈ పోరాటంలో ఇప్పటివరకు 400 మందికి పైగా మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. లక్షలాది మంది నిరాశ్రయులైనట్లు ఐరాస ప్రకటించింది.

## నేడు కృష్ణా జిల్లాలో జగన్ పర్యటన



అమరావతి : ఏపీ సీఎం జగన్ నేడు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బందరు పోర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభిస్తారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి బందరు మండల పరిధిలోని తపసిపూడి గ్రామం చేరుకుంటారు. అక్కడి నుంచి పోర్టు నిర్మాణ ప్రదేశంలో భూమి పూజ చేసిన అనంతరం పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు జగన్ చేరుకుంటారు. అక్కడి నుంచి జిల్లా పరిషత్ సెంటర్‌లోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభ అనంతరం మచిలీపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

## బందరు పోర్టుతో మారనున్న జిల్లా ముఖచిత్రం : పేర్ని నాని




మచిలీపట్నం: బందరు పోర్టు నిర్మాణంతో జిల్లా ముఖచిత్రమే మారబోతుందని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. ఆదివారం ఆయన బందరులో మీడియాతో మాట్లాడుతూ.. బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానుండడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. మహానేత వైఎస్సార్ మరణంతో బందరు పోర్టు నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఈ భూమి మీద ఉన్నంతవరకు బందరు పోర్టు ప్రజల ఆస్తి అన్నారు. ఈ పోర్టు నిర్మాణం కోసం రైతుల నుంచి బలవంతపు భూసేకరణ చేయలేదని స్పష్టం చేశారు. వందకు వందశాతం 1700 ఎకరాల ప్రభుత్వ భూమిలోనే పోర్టు నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళితే పోర్టు నిర్మాణం ఎప్పటికీ పూర్తి కాదని సీఎం జగన్ భావించారని, అందుకే బందరు పోర్టును ప్రభుత్వమే నిర్మిస్తుందని చెప్పారు.

## అన్నమయ్య డ్యామ్.. ప్రభుత్వ నిబద్ధత ఏంటో.. పవన్ కల్యాణ్ ట్వీట్



అమరావతి: ప్రభుత్వ నిబద్ధత ఏంటో తెలుసుకునేందుకు తాము నెల రోజులు ఆగుతామని ట్వీట్ చేశారు జనసేన అధినేత..పవర్ స్టార్ పవన్ కల్యాణ్. అన్నమయ్య డ్యామ్ బాధితులకు నెలరోజుల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. అన్నమయ్య డ్యామ్ బాధితుల విషయంలో వైసీపీ ప్రభుత్వ స్పందన.. మోకాలడ్డేలా, కంటి తుడుపు చర్యలా ఉండబోదని ఆశిస్తున్నా. మీరిచ్చిన హామీని ఎంత వరకు నిబద్ధతతో నెరవేర్చారో చూసేందుకు మరో నెల రోజులు జనసేన ఎదురుచూస్తుందని.. ఓ న్యూస్ వెబ్ సైట్ కథనాన్ని ఆయన షేర్ చేశారు. ఇంతకుముందు కూడా అన్నమయ్య డ్యామ్ పునర్నిర్మాణం, బాధితులకు సాయంపై ట్విట్టర్ వేదికగా పవన్ విమర్శలు చేశారు. అన్నమయ్య డ్యామ్ ని తిరిగి పూర్తిస్థాయిలో పునర్నిర్మాణం చేసి ఏడాదిలోగా ఆయకట్టుదారుల ప్రయోజనాలు రక్షిస్తామని ఘనంగా ప్రకటించారు. దుర్ఘటన జరిగి 18 నెలలు గడిచింది. ప్రాజెక్టు పూర్తి దేవుడికి ఎరుక. కనీసం ఈరోజుకీ వీసమెత్తు పనులు చేయలేదు. ఈ 18 నెలల్లో సాధించింది ఏమిటయ్యా అంటే.. అస్మదీయుడు పొంగులేటికి 3.94 శాతం అదనపు ప్రయోజనంతో రివర్స్ టెండరింగ్ డ్రామా నడిపి పనిని రూ.660 కోట్లకు అప్పచెప్పారన్నారు. కేంద్ర జల వనురుల శాఖ మంత్రి షెకావత్.. రాజ్యసభలో ఇది (అన్నమయ్య డ్యామ్ ఘటన) రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని స్పష్టంగా చెప్పారు. అంతర్జాతీయంగా ఈ ఘటన మీద అధ్యయనం జరిగితే మన దేశ ప్రతిష్టకు భంగం కలుగుతుందని వాపోయారని పవన్ కల్యాణ్ ట్వీట్ ద్వారా వెల్లడించారు.



## గోవిందరాజ స్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు ప్రారంభం



తిరుపతి : తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో మహాసంప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం ఆగమోక్తంగా ప్రారంభమయ్యాయి. మే 25వ తేదీన మహాసంప్రోక్షణతో ముగియనున్నాయి. ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో 37 మంది రుత్వికులు 19 హెూమగుండాలలో హెూమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు యాగశాలలో హెూమగుండాన్ని వెలిగించి పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, పంచగవ్యారాధన, వాస్తుహెూమం, రక్షాబంధనం, కలశస్థాపన, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

కళాకర్షణ :

రాత్రి 8 నుండి 10 గంటల వరకు కళాకర్షణలో భాగంగా గర్భాలయంలోని దేవతామూర్తుల శక్తిని కుంభం(కలశం)లోకి ఆవాహన చేస్తారు. ఈ కుంభాలతో పాటు ఉత్సవమూర్తులను యాగశాలలోకి వేంచేపు చేస్తారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ప్రధాన అర్చకులు శ్రీనివాస దీక్షితులు, డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవి కుమార్, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్ రావు, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ధనంజయులు, రాధా కృష్ణ, అర్చక బృందం పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లాలో పులి కలకలం.. బెంబేలెత్తుతోన్న జనం



ప్రకాశం: ఈ మధ్య కాలంలో జనవాసంలోకి పులులు సంచారం చేస్తున్నాయి. తాజాగా ప్రకాశం జిల్లాలో పెద్దపులి కలకలం రేగింది. జిల్లాలోని అర్థవీడు మండలంలో పులి సంచరిస్తుండడంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మాగుటూరు, నాగులవరం, గొట్టిపడియ లక్ష్మీపురం ప్రాంతాల్లో పులి సంచరించినట్టు గుర్తించారు. పులి సంచారంతో అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగారు. పులి పాదముద్రలను సేకరించారు. ఈ పెద్దపులి నీరు తాగేందుకు నాగులవరం సమీపంలోని కంభం చెరువు వద్దకు వచ్చిందని అధికారులు నిర్ధారించారు. పులి సంచారం నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పులిని బంధించి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే అర్థవీడు మండలంలో గత జనవరిలోనూ పులి బెంబేలెత్తించింది. కాకర్ల సమీపంలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఓ ఆవును చంపి తినేసింది. మరో ఆవుపై దాడి చేస్తుండగా రైతులు కేకలు వేయడంతో పారిపోయింది. ఇప్పుడు పులి సంచరిస్తుందన్న సమాచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

## అవినాశ్ పారిపోతే మీకెందుకు.. సీబీఐ చూసుకుంటుంది : స్పీకర్ తమ్మినేని సీతారాం




కర్నూలు : కడప ఎంపీ అవినాశ్ రెడ్డి పారిపోతే సీబీఐ చూసుకుంటుందని స్పీకర్ తమ్మినేని సీతారాం సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాశ్ రెడ్డి పాత్రపై మీడియా అడిగిన ప్రశ్నలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వివేకా హత్యకేసులో అవినాశ్ రెడ్డి పాత్ర ఉంటే సీబీఐ తేలుస్తుందని.. మీడియాకు చెప్పాలా? అని నిలదీశారు. 'మీరేమైనా సీబీఐ చీఫా ? అంటూ మీడియా ప్రతినిధులపై తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం నంద్యాల జిల్లాలోని శ్రీశైలం మల్లికార్జున స్వా మిని స్పీకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నారా లోకేశ్ కు తెలుగు భాష మాట్లాడడమే చేతకాదని విమర్శించారు. ముందస్తు ఎన్నిక లపై జగన్ చూసుకుంటారని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని జోస్యం చెప్పారు.

## రూ.2వేల నోట్ల రద్దుతో సామాన్యులకు ఇబ్బంది లేదు: సోము వీర్రాజు

అమరావతి: రూ.2 వేల నోట్లను రద్దు చేయడం వల్ల సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది లేదని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. విజయవాడలో బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సోము వీర్రాజు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చార్జ్ షీట్ కార్యక్రమంలో చాలా అంశాలు వెలుగులోకి వచ్చాయని సోము వీర్రాజు తెలిపారు. గ్రామాల్లో వైసీపీ సర్పంచ్‌లు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడారని ఆరోపించారు. 6 నెలలుగా రాష్ట్రంలో 2వేల నోట్లు కనిపించడం లేదని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు ఆందోళనకు పిలుపునివ్వడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అంటూ విమర్శలు గుప్పించారు.

## మహిళలకు దిశా యాప్ పై అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్



కర్నూలు ప్రజాపాలన ప్రతినిధి : మహిళా పోలీసుల జాబ్ చార్ట్ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా ఎస్పీ. గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసుల జాబ్ చార్ట్ పై జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్ ఐపియస్ గారు జిల్లా పోలీసు కార్యాలయం నుండి శనివారం విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ పరిధులలోని గ్రామ, వార్డు సచివాలయలలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొదటి సారిగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మహిళ పోలీసులను ఉద్దేశిస్తూ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళల రక్షణ కోసం ప్రతి సచివాలయం పరిది లో ఒక మహిళా పోలీసులను నియమించడం జరిగిందని, మీరు కూడా పోలీస్ వ్యవస్థలో ఒక భాగమన్నారు. ప్రతి ఒక మహిళా పోలీసు తమ సచివాలయం పరిధిలోని గ్రామ, పట్టణ మహిళలతో క్రమం తప్పకుండా మమేకమౌతూ, తద్వారా వారి యొక్క సమస్యలను తెలుసుకోవాలన్నారు. పై అధికారుల సహాయంతో పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. గ్రామాలలో వరకట్న వేధింపులు, బాల్యవివాహాలు, కుటుంబ తగాదాలు, స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి స్త్రీ కి దిశ యాప్ గురించి అవగాహన పెంచాలన్నారు. తమ పరిధిలోని పాఠశాలలను క్రమంగా సందర్శించాలన్నారు. విద్యార్థినిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మొదలైన ఇతర విషయాలపై అవగాహన పెంచాలన్నారు. మహిళలు, బాలికలు లైంగిక దోపిడికి గురికాకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల పై నిఘా ఉంచుతూ ఆ సమాచారాన్ని పోలీసు అధికారులకు అందజేయాలన్నారు. మంచి సత్సంబంధాలు ఏర్పరచుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే మహిళా పోలీసులకు కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. మహిళా పోలీసుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ గారు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, సఖి ఒన్ స్టాప్ సెంటర్, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్, ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. పోక్సో యాక్ట్, లైంగిక వేధింపుల చట్టం, బాల్యవివాహాల చట్టాల గురించి తెలుసుకుని అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ విడియో కాన్ఫరెన్సులో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటాద్రి, డిపిఓ ఎఓ సురేష్ బాబు, సిఐలు, ఎస్సైలు, ఆయా గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# గృహహింస బాధితుల్లో అనారోగ్య తీవ్రత



సుభద్రకు చిన్నప్పటి నుంచి ఆస్తమా సమస్య ఉంది. పెళ్లయి పిల్లలున్నా ఇప్పటికీ ఆ సమస్య వేధిస్తోంది. బాల్యంలో కంటే ఇప్పుడు ఇంకా ఇబ్బంది పడుతోంది. దీంతో తరచూ హాస్పటళ్ల చుట్టూ తిరగాల్సివస్తోంది. జానకికి బాల్యంలో ఆస్తమా లేకపోయినా పెళ్లయిన తరువాత నుండి వ్యాధితో బాధపడుతోంది. దీనికి తోడు చర్మసంబంధిత అలెర్జీలు ఆమెను పట్టిపీడిస్తున్నాయి. ఈ ఇద్దరు మహిళల్లో ఈ సమస్య పైకి చాలా సాధారణంగా కనబడుతోంది. పైగా పనుల ఒత్తిడిల్లో నిత్యం సతమతమయ్యే మహిళలు రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధపడడం చాలా మామూలు విషయంగా పరిగణిస్తాం. కానీ ఈ అనారోగ్యం వెనుక ఆమె పడుతున్న గృహహింస కూడా ఒక కారణమని పరిశోధనల్లో తేలింది. ప్రపంచంలో అనేక మంది మహిళలు ఎదుర్కొనే గృహహింస ఆమెను మానసికంగా, శారీరకంగా ఇబ్బందుల పాల్జేస్తున్నదని ఒక పరిశోధనలో తేలింది. గృహహింసకు గురైన మహిళల్లో ఆస్తమాతో పాటు అటోపిక్ వ్యాధులు (చర్మ సంబంధిత అలెర్జీలు, ప్రకృతి సంబంధ కారణం లేకుండా సంక్రమించే వ్యాధులు) ఎక్కువగా ప్రబలుతున్నట్లు లండన్‌కు చెందిన 'జర్నల్ ఆఫ్ అలెర్జి అండ్ క్లినికల్ ఇమ్యునాలజీ'లో ప్రచురితమైంది. మహిళల్లో వ్యాధి తీవ్రతలపై నివేదికను తయారుచేసిన డాక్టర్ల బృందం వారు తరచూ ఎదుర్కొంటున్న గృహహింసపై కూడా పరిశోధనలు చేసింది. గృహహింసకు గురికాని మహిళల వ్యాధి తీవ్రత కంటే గృహహింసకు గురవుతున్న మహిళల్లో తీవ్రత ఎక్కువగా ఉందని నివేదికలో తేలింది. 'గృహహింసకు గురౌతున్నట్లు చెప్పిన మహిళల్లో 52 శాతం మందికి 'అటోపిక్ వ్యాధులు' తీవ్రంగా ప్రబలినట్లు' లండన్‌లోని 'యూనివర్శిటీ ఆఫ్ బర్మింగ్‌హమ్'కు చెందిన వైద్యులు డాక్టర్ జొహట్ సింగ్ చందన్ తెలిపారు. 'ప్రపంచవ్యాప్తగా గృహహింసకు గురవుతున్న మహిళల సంఖ్య ఎక్కువగానే ఉంది. మా నివేదిక దాన్ని ఆధారం చేసుకొనే తయారుచేశాం. మా బృందం మొదట బాధిత మహిళల ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసేందుకు, ప్రజారోగ్య విధానాల ప్రభావం వంటి వాటిపై చేయాలనుకున్నాం. అయితే పరిశీలనా క్రమంలో గృహహింస బాధితులను ప్రత్యేకంగా అంచనా వేశామ'ని సింగ్ అంటున్నారు. 'మా డాక్టర్ల బృందం గృహహింసకు గురైనట్లు బహిర్గతమైన 18 ఏళ్ల పైబడిన మహిళల ఆరోగ్య సమస్యలను, గృహహింసకు గురికానటువంటి మహిళల ఆరోగ్య సమస్యలతో సరి పోల్చింది. బాధితులమని పేర్కొన్న 13, 852 మంది మహిళలను బాధితులు కాని 49, 036 మహిళలతో అంచనా వేసినప్పుడు బాధితుల్లో 967 మంది(7 శాతం), బాధితులు కానివారిలో 2,607(5.3 శాతం) మందిలో ఆస్తమా సమస్యతో పాటు అటోపిక్ వ్యాధులు ప్రబలినట్లు గుర్తించారు. పైగా బాధితుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు పరిశీలనలో తేలిందని' సింగ్ చెబుతున్నారు.

## గంటల్లోనే లారీ అపహరణ కేసు ఛేదింపు



కావలి, మే21: సిమెంట్ లోడ్‌తో వెళుతున్న లారీని శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు అడ్డుకుని డ్రైవర్‌ను కొట్టి లారీని తీసుకెళ్లిపోయారు. సమాచారం అందిన రెండు గంటల వ్యవధిలో నిందితుడిని అరెస్ట్‌చేసి, లారీని స్వా?ధీన పరుచుకున్నట్లు కావలి డీఎస్పీ ఎం. వెంకటరమణ తెలిపారు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మాచర్ల కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి రెండు లారీలను నెల్లూరుకు తీసుకువెళుతున్నారు. కావలి రూరల్ మండలం గౌరవరం డాబా హెూటళ్ల వద్ద శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు మోటారుసైకిల్‌పై వచ్చి అందులో ఓ లారీకి మోటారుసైకిల్‌ను అడ్డు పెట్టారు. దీంతో ఇద్దరు లారీ క్యాబిన్‌లోకి వెళ్లి డ్రైవర్‌ను కత్తితో బెదిరించి డబ్బులు ఇవ్వమన్నారు. డ్రైవర్ తనదగ్గర డబ్బులు లేవనగా ఆయన ప్యాంటు జేబులో ఉన్న రూ.3,000లు తీసుకున్నారు. ఆ సమయంలో వెనుక వస్తున్న మరో లారీడ్రైవర్ అన్వర్ మొదటిలారీ డ్రైవర్ రామోజీకి ఫోన్ చేశాడు. దీంతో ఆయన తనను దొంగలు బెదిరిస్తున్నారని చెప్పాడు. అన్వర్ వెంటనే 112కు డయల్ చేశారు. 3.29 గంటలకు ఆ ఫోన్‌ను రిసీవ్ చేసుకున్న నెల్లూరు కంట్రోల్ రూమ్ సిబ్బంది జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లను అలర్ట్‌చేశారు. హైవే మొబైల్ సిబ్బంది తిరుపతయ్య, సుధాకర్, కొడవలూరు నైట్ రౌండ్ ఆఫీసర్‌గా ఉన్న ఏఎస్‌ఐ ప్రసాద్‌లు అలర్ట్‌అయి రాజుపాలెంవద్దకు వెళ్లారు. అప్పుడే ఆ లారీ వెళుతుండగా దాన్ని వెంబడించి తెల్లవారుజామున 4.30 గంటలకు లారీని పట్టుకుని, నిందితుడు షేక్ ముస్తాఫాను అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను విచారించగా ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన వ్యక్తిగా చెప్పారు. గతంలో అతనికి పలు నేరాలతో సంబంధం ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. అతన్ని అరెస్ట్ చేసి సిమెంట్‌తోపాటు లారీని, రూ.3,000ల నగదును పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. కావలి రూరల్ ఎస్‌ఐ వెంకట్రావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డ్రైవర్ రామోజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిగిలిన ఇద్దరి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ రాజేష్, ఎస్‌ఐ వెంకట్రావులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం



మల్హార్, మే 21 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలంలోని నాచారం గ్రామ పంచాయతీ పరిధిలో గల కాలవేణి సమ్మయ్య ఇల్లు ఆదివారం కరెంటు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధమైంది. సమ్మయ్య కుటుంబీకులు పొలం పనికి వెళ్లి వచ్చేసరికి దట్టంగా మంటలు వ్యాపించడంతో గమనించిన గ్రామస్తులు నీళ్లతో చల్లార్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సమ్మయ్య ఇంట్లో ఉన్న బట్టలు, బియ్యం, వంట పాత్రలు మంచాలు, గృహెూపకరణాలు, విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత సమ్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే నుంచి పార్టీని కాపాడండి..

శ్రీకాకుళం, మే 21, : అధికార వైసీపీలో అసమ్మతి మంటలు భగ్గు మంటున్నాయి. ఎమ్మెల్యే రెడ్డి శాంతిని వ్యతిరేకిస్తు ఓ వర్గం రోడ్డెక్కడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆమెకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కేటాయించవద్దని బహిరంగంగా అల్టిమేటమ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారుతుంది. కాగా రెడ్డి శాంతి కుటుంబానికి తొలి నుంచి ఆ పార్టీ అధినేత సీఎం జగన్మోహన్ రెడ్డితో స్నేహసంబంధాలున్నాయి. రెడ్డి శాంతి వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పాలవలస రాజశేఖర్ కుమార్తెగా జిల్లా వాసులకు పరిచయం. అంతకు ముందు రెడ్డి శాంతి భర్త నాగభూషణంతో జగన్ పార్టీ స్థాపించినప్పటి నుంచే సత్సంబంధాలున్నాయి. 2014లో శ్రీకాకుళం ఎంపీ టిక్కెట్ కేటాయించిన రోజే అందరికీ తెలిసింది. ఆ ఎన్నికల్లో ఓటమి పాలైన అనంతరం ఆమె పార్టీకి జిల్లా అధ్యక్షురాలు వంటి కీలక బాధ్యతలు తీసుకున్నారు. ఆమె సామాజిక వర్గం అధికంగా ఉన్న పాతపట్నం సెగ్మెంటు నుంచి 2019 ఎన్నికలో బరిలో దిగి విజయం సాధించారు. తొలి రెండేళ్లు ఆమె కేడర్ కు అందుబాటులో ఉండడం లేదని టాక్ నడిచింది. ఆమె భర్త నాగభూషణ్ అనారోగ్యంతో మరణించారు. తదుపరి రెడ్డి శాంతి పాతపట్నం సెగ్మెంటులో ఎక్కువగా ఉండడానికి ప్రయత్నం చేశారు. కరోనా సమయంలో జిల్లాలో మిగిలిన ఎమ్మెల్యేల కంటే పర్యటించారు. తరువాత గడప గడపకు కూడా ప్రజలలో కనిపిస్తున్నారు. అయినా సొంతింటిలో ఉన్న వర్గ పోరు రోజు రోజుకు రాజుకుంటుందే తప్ప చల్లారే పరిస్థితి కానరావడంలేదు. స్థానిక సంస్థల ఎన్నికలప్పటి నుంచి రాజుకున్న వర్గపోరు చాపకిందలా నీరులా సాగింది. రెడ్డి శాంతి కుమారుడు శ్రావణ్ హిరమండలం జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. జగన్మోహన్ రెడ్డి, పార్టీ క్రేజ్ ఏవీ కూడా ఆ ఎన్నికల్లో పనిచేయలేదు. అప్పటి నుంచే పార్టీకి బీటలు వారినా ఎమ్మెల్యేగా రెడ్డి శాంతి చక్కదిద్దుకోకపోగా ఆ పార్టీ జిల్లా నాయకత్వం కూడా సరిదిద్దలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్తూరు, పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి మండలాల్లో ఆమె బీ ఫారం జారీ చేయడానికే పరిమితమయ్యారు తప్ప ఆమె నిర్ణయించిన మేరకు కొందరిని ఎంపీపీ, వైఎస్ ఎంపీపీలు కూడ పీఠంపై కూర్చోబెట్టలేని పరిస్థితి ఏర్పడింది. అనంతరం కూడ ఆ సెగ్మెంటులో పోటాపోటీగా అధికార పార్టీలో నెలకుంటున్న కుమ్ములాటలకు చెక్ పడలేదు. ఓ వైపు నాన్ లోకల్ అంటు రెడ్డి శాంతిపై ముద్రపడగా, మరో వైపు తాజాగా సొంత పార్టీ శ్రేణులపై కేసులు పెడుతున్నారంటు ఏకంగా కొత్తూరు మండలంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం వైసీపీలో పెద్ద దుమారం రేపుతుంది. అధికార పార్టీకి చెందిన వ్యక్తి సోషల్ మీడియాలో చేసిన పోస్టుపై ఎమ్మెల్యే అనుచర వర్గం కొత్తూరు పోలీసు స్టేషన్లో ఇటీవల కేసు పెట్టారు. ఇది పెద్ద దుమారం రేపింది. ఇప్పటి వరకు ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై వ్యతిరేకంగా పనిచేస్తున్న వర్గం నేరుగా రోడ్డెక్కి తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. బుధవారం కొత్తూరు మండలకేంద్రంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వ్యతిరేకంగా అక్కడ వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీప్రసాద్ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జగన్ ముద్దు, రెడ్డి శాంతి వద్దు అంటు ఈ వివాదం వైసీపీలోనే కాకుండా జిల్లాలోనే సంచలనం రేకెత్తిస్తోంది. సొంతపార్టీలోని నేతలు, కార్యకర్తల మధ్య వర్గపోరు ముదిరి పార్టీ శ్రేణుల అసంతృప్తి సెగరాజుకుంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తితో ఉన్న ఎంపీపీ, ఎంపీటీసీలను, సర్పంచ్లను, వార్డు మెంబర్లను, జడ్పీటీసీలను, పార్టీ సీనియర్ నాయకులను కొత్తూరు వైస్ ఎంపీపీ తులసీవరప్రసాద్ ఏకతాటిపైకి తీసుకు రావడంలో విజయం సాధించారు. ఇటీవలే కర్లేమ్మ గ్రామ పంచాయతీ నేతాజీ నగర్ కాలనీలో, ఎమ్మెల్యే రెడ్డి శాంతి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించగా స్థానిక నేతలు రాలేదు. కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్ఎన్ పేట మండలాల నుంచి ఆమెకు వ్యతిరేకంగా ఓ వర్గం నినాదాలు చేస్తు కొత్తూరు వెళ్లి ర్యాలీలో పాల్గొనడం రెడ్డి శాంతి అనుచరులకు అసలు మింగుడపడడంలేదు. అదే పార్టీలో ఉంటు ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన జిల్లా పార్టీ కనీసం స్పందించకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు మరో ఏడాదే సమయం ఉండడంతో ఈ తరుణంలో ఈ గ్రూపుల గోల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సొంతపార్టీ నేతలపైనే అక్రమ కేసులు బనాయించడపై అసమ్మతి వర్గం మండిపడుతుంది. రెడ్డి శాంతి వ్యతిరేక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు నల్లబ్యాడ్జీలతో ర్యాలీలో పాల్గొనడం అధికారపార్టీలో కలకలం నెలకొంది.

## రాజీవ్ గాంధీ వర్దంతి కార్యక్రమం



జగ్గంపేట, ప్రజాపాలన ప్రతినిధి: భారత మాజీ ప్రధాని, భారత రత్న , భారత సాంకేతిక రంగ విప్లవ ఆద్యుడు శ్రీ రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివ గణేష్ గారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి స్థానిక జగ్గంపేట అంబేద్కర్ నగర్ నందు గల రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ గణేష్ మాట్లాడుతూ నేడు సుమారు 7 లక్షల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం విదేశాల నుండి ఉద్యోగ మరియు టెక్నాలజీ సర్వీసెస్ సంబంధించి విదేశీ ధనాన్ని భారతదేశానికిలి తీసుకురావడానికి గల కారకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దీని విలువ భారతదేశ లిసంవత్సర బడ్జెట్లో 30 శాతంలి అని గుర్తు చేశారు.భారత రాజ్యాంగ 73 మరియు 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుండి నేరుగా నిధులు సమకూరే విధంగా చట్టాన్ని సవరించారని, మహాత్మా గాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యానికి ఆజ్యం పోసారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ వత్సవాయి సత్యనారాయణ రాజు అనే బాబు, డాక్టర్ నక్క సత్యనారాయణ, చంద్రమౌళి వెంకటరత్నం అనే చిన్నారి, యువజన కాంగ్రెస్ జగ్గంపేట మండల అధ్యక్షులు కాటె జయలి పాల్గొన్నారు.

## మినీ మహా నాడులో ఎస్సీ సెల్, బిసి సెల్ ప్రమాణ స్వీకారం.. టిడిపి నాయకులు



పల్నాడు జిల్లా. నరసరావుపేట .మే 21 ( ప్రజాపాలన ప్రతినిధి) :పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఎస్సీ సెల్ సమావేశంలో ఈనెల 22వ తేదీ సోమవారం జరగబోయే ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా మినీ మహానాడు కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రమాణ స్వీకారం, బీసీ సెల్ ప్రమాణస్వీకారం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీలకు, బీసీలకు, మైనార్టీలకు, అన్ని వర్గాలను మోసం చేసిందని,2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని, ముఖ్యంగా ఎస్సీలను మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఎస్సీలందరూ కలిసి, వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకులు, అందరూ విచ్చేసి మినీ మహానాడు విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్ బాబు, పల్నాడు జిల్లా టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జి.పి. కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చింతిరాల బాలు, టీడీపి జిల్లా ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు పెరికల రాయప్ప, మద్దు తిరుపతియ్య, టిడిపి ఎస్సీ సెల్ సెక్రెటరీ కోర్నెపాటి మధు, ఎస్సీ సెల్ నాయకులు వర్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు

## నరసరావుపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



పల్నాడు జిల్లా .నరసరావుపేట .మే 21 ( ప్రజా పాలన ప్రతినిధి.): నరసరావుపేట కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో పలనాడు జిల్లా డిసిసి అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.నరసరావుపేట(పల్నాడు) జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ ,పార్టీ కార్యకర్తలతో కలిసి, భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు రాజీవ్ గాంధీ చిత్రపటానికి కి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ 1984, అక్టోబరు 31 న తల్లి అయిన ఇందిరమ్మ మరణంతో ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా పనిచేశాడు. 40 సంవత్సరాల వయసులో ప్రధానమంత్రి అయిన రాజీవ్ గాంధీ, భారత ప్రధానమంత్రి పదవి నిర్వహించినవారిలో అతి పిన్న వయస్కుడు. జాతీయ బాధ్యతను ఎంతో హుందాగా, ఓర్పుగా తన భుజాలకు ఎత్తుకున్నారు.నెల రోజులపాటు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాజీవ్‌గాంధీ దేశంలోని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి అలుపు అలసట లేకుండా ప్రయాణించారు. అనేకచోట్ల 250 సభల్లో మాట్లాడారు. కోట్లాది మంది ప్రజలతో ముఖాముఖి జరిపారు.ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన రాజీవ్‌గాంధీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. తన ప్రధాన ఆశయాలలో భారత ఐక్యతను పరిరక్షిస్తూనే దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకువెళ్ళడం ముఖ్యమైనదని రాజీవ్ పదేపదే చెబుతూండేవారు. ఇతని వర్ధంతి రోజైన మే 21నాడు జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుంది.అని ఆయన తెలిపారు. ఇకనైనా వారి ఆశయాలకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని భారత దేశం అన్నీ రంగాలలో అభివృద్ధి చెందలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం దేశానికి ఎంతో అవసరం ఉందని అన్నారు. అందుకోసం పార్టీ నాయకులు,కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ ఎం భాష , సీదా కృష్ణ ,రవి కిషోర్,రమేష్,పి రమేష్,కొండలు,బుల్లి,ప్రేమ్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ముగింపు కార్యక్రమంలో వైసీపీ ప్రభుత్వం పై డా.చదలవాడ ధ్వజం



పల్నాడు జిల్లా. నరసరావుపేట .మే 21 (ప్రజాపాలన ప్రతినిధి ): ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ముగింపు కార్యక్రమం నరసరావుపేట చింతలపాలెం,యక్కలవారిపాలెం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డా.చదలవాడ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల పై ధ్వజమెత్తారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక ఉచితంగా అందించే వాళ్ళమని వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేలు ఇసుకను అక్రమంగా అమ్ముకుంటు ఇసుక పేదలకు అందకుండా ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ కోట్లు దండుకుంటున్నారని డా.చదలవాడ అరవింద బాబు ఆరోపించారు.మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఇసుకను ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు.వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని పట్టపగలే మహిళల పై అత్యాచారాలకు తెగబడుతున్నారన్నారు.వైసిపి ప్రభుత్వంలో జరిగిన అత్యాచారాల పై విచారణ జరిపించి భవిష్యత్తులో ఎవరు అత్యాచారం చేయాలనే ఆలోచన రాకుండా కఠినంగా చట్టాలు చేస్తామన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగిస్తామని 36 వేల ఎకరాలు ఇచ్చిన రైతులను ఆదుకునే విధంగా అమరావతి రాజధాని పరిపాలన కేంద్రంగా చేస్తామని తెలిపారు.గతంలో మన ప్రభుత్వంలో పేదవారికి 200 యూనిట్లు వరకు విద్యుత్ ఉచితంగా ఇచ్చిన విధానాన్ని కొనసాగిస్తామన్నారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి నిరుద్యోగ సమస్య ఉండేది కాదని,అదే విధంగా ఏలాంటి ఉద్యోగ సమస్య లేకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు.రాష్ట్రంలో గంజాయి గుట్కా లాంటి మాదకద్రవ్యాలు మాఫియాను జరగకుండా అరికడతమన్నారు.చంద్రబాబు పాలనలో మన రాష్ట్రంలో రోడ్లు ఎంత సుందరీకరించామో ఆ విధంగానే రోడ్లన్నిటినికి మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్రంలో అవినీతి లేని పరిపాలన అందిస్తూ...అవినీతి,అక్రమాలను అరికడతామన్నారు.మన ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో ప్రతి వార్డులలో ఎటువంటి మంచినీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామన్నారు.రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి పేద వాడి సొంతింటి కల నిజం చేయడానికి ప్రతి పేదవాడికి టిడ్కో ఇల్లు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆనందపురంలో నూతన జనసేన రూరల్ కార్యాలయం ప్రారంభం





భీమిలి ప్రజాపాలన ప్రతినిధి మే 21:ఆనందపురం వేములవలస జంక్షన్లో మూడు మండలాలకి సంబంధించి నూతన రూరల్ పార్టీ కార్యాలయం ను భీమిలి జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు ప్రారంభోత్సవం అనంతరం సందీప్ మాట్లాడుతూభీమిలిలో నియోజవర్గం కార్యాలయం ఉండగా రూరల్ మండలాలకు సంబంధించి మరింత చేరువుగా ఉండేవిధంగా రాబోయే రోజుల్లో జనసేన పార్టీ కార్యాలయంలో గ్రామస్థాయి నుండి సమస్యలు పరిష్కారం దిశగా ఈ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తున్నామని వచ్చే నెల నుండి గ్రామస్థాయి మండల స్థాయి కమిటీలు వేస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారు జూన్ నుండి వారాహి యాత్ర చేపట్టబోతున్నారని పార్టీ కోసం మరిన్ని ప్రణాళికలు తయారు చేస్తున్నామని రాష్ట్ర స్థాయి నాయకులు ప్రతినెల జిల్లా నాయకులతో మాట్లాడుతారని భీమిలి నియోజవర్గంలో జనసేన పార్టీ ఇంకా మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా అలాగే ఉత్తరాంధ్రలో క్రియాశీలక సభ్యత్వాల్లో భీమిలి మొదటి స్థానంలో ఉందని రేపు రాబోయే అసెంబ్లీ ఎలక్షన్లో భీమిలిలో జనసేన జెండా ఎగరవేస్తామని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని ఇంత చక్కటి కార్యక్రమానికి కృషి చేసిన నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు శివశంకర్, యసస్వి, ప్యాక్ నెంబర్ కోన తాతారావు, అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శులు అప్పారావు ,శివ దత్తు, ప్రశాంతి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ 33వ కార్పొరేటర్ వసంత లక్ష్మి, 22 కార్పొరేటర్ పీతల గురుమూర్తి యాదవ్, 64 కార్పొరేటర్ గోవింద్, శాఖరి శీను బాబు ,మండల నాయకులు మజ్జి శ్రీనివాసరావు, దుక్క వెంకట్రావు, తమ్మిన అప్పలరాజు, తాడివాడ శివకృష్ణ, బొద్దాపు గోవిందు, పిన్నింటి సన్యాసిరావు, కొయ్య నాని, తెడ్లాపు.నర్సింగరావు, మీసాల నాగేశ్వరరావు, తైలం రఘు, ప్రశాంత్ కుమార్ నాయుడు, ఆకుల అభి, ఆల్తిరాజు, పరిమి భువనేశ్వరి, కుప్ప రామలక్ష్మి, ఉప్పాడ యశోద, మూడు మండలాలకు సంబంధించిన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయాలని హోంమంత్రి తానేటి వనిత పిలుపు



ప్రజాపాలన ప్రతినిధి కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో ఈ నెల 24న ముఖ్యమంత్రి పర్యటనను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత కోరారు. ఈ మేరకు ఆదివారం హోంమంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ బుధవారం నాడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సత్యవతి నగర్ లో క్యాంప్ ఆఫీస్ ఎదురుగా వున్న స్థలంలో సభ నిర్వహిస్తామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సీఎం జగన్ మోహన్ రెడ్డికి మద్దతుగా అందరూ విచ్చేసి సభను విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో హోంమంత్రి విజ్ఞప్తి చేశారు.

# గజల్ వినోద్ కి హార్దిక శుభాకాంక్షలు



పల్నాడు జిల్లా .నరసరావుపేట. మే 21 ( ప్రజాపాలన ప్రతినిధి): స్వామీ వివేకానంద అమెరికా (చికాగో )దేశం వెళ్లి హైందవ సంస్కృతి, భారత దేశ గొప్ప తనాన్ని, మన దేశ సాంప్రదాయాలు, మన దేశం యొక్క ఔన్నత్యం, విలువలను ను గూర్చి ఎంతో గొప్పగా అద్భుతమైన ఉపన్యాసాలతో... తమ వాక్ చాతుర్యంతో పాచ్చాత్య అమెరికా దేశీయులను విశేషంగా ఆకర్శించి, వారి యొక్క హృదయాలు చూరగోని, భారత దేశ కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం చేసి... ప్రపంచంలో ఒక గొప్ప మహాపురుషునిగా వెలుగొందినారు. అలాగే.... మన యువ గజల్ గాయకుడు మన మిత్రుడు గజల్ వినోద్ నేడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వెనుక బడిన ప్రస్తుత పార్వతీపురం ం మన్యం జిల్లా (గత ఉమ్మడి విజయనగరం జిల్లా జిల్లాలో) పూర్తిగా వెనుక బడిన లిచినమరికలి అనే మారుమూల కుగ్రామం లో జన్మించిన గజల్ వినోద్ తన గజల్ గానామృతం ద్వారా మేధాదవుల, పండిత - పామర, సంగీత కళా ప్రియుల, విద్యావేత్తల తెలుగు ప్రజలందరి మన్ననలు, ఆధారాభిమానాలు పొందడమే కాకుండా... జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో.... విదేశాలలో కూడా.... తన గజల్ గానంను వినిపించి ఎన్నో... మరెన్నో... పురస్కారాలు ం అవార్డులు, బిరుదులు సత్కారాలు పొందారు. అలాగే ఉమ్మడి తెలుగురాష్ట్రలలోని (ఆంధ్ర ం తెలంగాణ) మన సంస్కృతి ం సాంప్రదాయాలు,గ్రామీణ /పల్లెల వృత్తులు, సంస్కృతి ం సాంప్రదాయాలు, కుటుంబం బంధాలు ం అనుబంధాలు, గూర్చి తన గజల్ గానం ద్వారా ప్రజలను చైతన్య పరిచి రెండు తెలుగు రాష్ట్రల ప్రజల హృదయాలు చూరాగొన్న గొప్ప యువ గాయకుడు వినోద్. నేడు వినోద్ ని అమెరికాదేశంలోని అభిమానులు ప్రత్యేక గజల్ సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి... వినోద్ ని తన గజల్ ద్వారా... గానంను వినిపించడానికి ముఖ్య అతిధిగా ఆహ్వానించడం గొప్ప విషయం. నేడు సప్త సముద్రాలు దాటి అమెరికా దేశంలో గజల్ వినిపించడానికి వెళ్తున్న మన మిత్రుడు గజల్ వినోద్ కి మా హార్దిక శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాము. వినోద్ మీరు గజల్ గానామృతంతో అమెరికా దేశంలో అద్భుతంగా వినిపించి. దేశ విదేశాల్లో ఎన్నో అవార్డులు, పురస్కారాలు, బిరుదులు స్వీకరించి, సన్మానాలు పొంది దిగ్విజయంగా మన దేశానికి రావాలని... మనస్ఫూర్తిగా కోరుకుంటూ... హార్దిక శుభాకాంక్షలతో మీయొక్క హితైషులు, మరియు మీయొక్క మిత్రులు, డా: బెల్లంకొండ శ్రీనివాసరావు. సెక్రటరీ కరెస్పాండంట్. బెల్లంకొండ విద్యాసంస్థలు. ప్రకాశం జిల్లా. ఆ.ప్ర...

## నాణ్యమైన ఆఫ్లైన్ విద్యకు ప్రాధాన్యత

బెంగళూరు, ప్రజా పాలన ప్రతినిధి : గత విద్యా సంవత్సరంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇప్పటికే వంద కోట్లకు పైగా ప్రోత్సాహకాలను అందించిన ఫిజిక్స్ వాలా వచ్చే విద్యా సంవత్సరంలో నాణ్యమైన ఆఫ్లైన్ విద్యకు అర్హులైన విద్యార్థులకు 160 కోట్ల విలువైన స్కాలర్షిప్లను అందించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకుడు, సీఈఓ అలఖ్ పాండే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ వ్యాప్తంగా అర్హులైన విద్యార్థులకు స్కాలర్షిప్లు, మెంటర్షిప్ ద్వారా అసాధారణమైన విద్యావకాశాలను అందించడంలో తిరుగులేని నిబద్ధతకు ఫిజిక్స్ వాలా స్కాలర్షిప్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహణ నిలుస్తుందన్నారు. గత పరీక్షలో పది లక్షల కన్నా ఎక్కువ మంది విద్యార్థుల నుంచి వచ్చిన అద్భుతమైన స్పందన నిజంగా స్ఫూర్తిదాయకంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు దీని నుంచి ప్రయోజనం పొందుతారని ఆశిస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

సోమవారం 22, మే 2023

# ఎజెండా మార్చుకుంటారా?

కర్ణాటకలో బీజేపీ ఓటమి, కాంగ్రెస్ పార్టీ గెలుపుపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. పార్లమెంట్ ఎన్నికలకు కొద్ది నెలల ముందు జరిగిన ఈ ఎన్నికలు భారత రాజకీయాల్లో సరికొత్త అంశాలపై చర్చకు దారి తీశాయి. బీజేపీ విషయంలో రెండు స్పష్టమైన అంశాలనూ ఎత్తి చూపించాయి. అందులో బీజేపీ భావోద్వేగపు ఎజెండానే కాంగ్రెస్ పార్టీ కొనసాగించిన అంశం ఒకటి. కర్ణాటకలో ఎన్నికల ప్రచారం మొదలుకొని కౌంటింగ్ జరిగే చివరి నిమిషం వరకు దైవ నామ స్మరణలతో ఆ రాష్ట్రం మారుమోగింది. తామూ గుళ్లకు వెళ్తున్న ఫోటోలను సోషల్ మీడియాలో మరీ ప్రచారం చేసుకున్నారు కాంగ్రెస్ నాయకులు. సహజంగానే కర్ణాటకలో మఠాలు, పీఠాధిపతులు, స్వామీజీల సంఖ్య ఎక్కువ. అలాంటి రాష్ట్రంలో భక్తికి కాస్త ఎక్కువగానే చోటు ఉంటుంది. ఈ మూలాలనే గట్టిగా పట్టుకొని బీజేపీ ముందుకు సాగగా అనూహ్యంగా కాంగ్రెస్ సైతం గుళ్ళు, గోపురాలు అంటూ తిరగటం, హిందూ దేవుళ్లు అందులో ప్రధానంగా బజరంగ్ బలి ఏ ఒక్కరి సొంతం కాదు%ౌ%ఆయన అందరివాడు అని చెప్పే ప్రయత్నం చేయడం స్పష్టంగా కనిపించింది. ఆంజనేయ స్వామినే అంతా నమ్ముకున్నట్టు కన్పించింది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు దేశ రాజ్యాంగ పీఠిక గురించి మాట్లాడిన ప్రతిసారి హిందూ అంశాన్ని జోడించి బీజేపీ నాయకులు మాటలతో దండయాత్ర చేసే వారు. అంతే కాదు హనుమాన్ చాలీసాను చదివి నిరసనలు వ్యక్తం చేసేవారు. ఆ విధంగా తాము యావత్ దేశంలోని హిందూదేవుళ్లకు, భక్తులకు బ్రాండ్ అంబాసిడర్లుగా భావించారు. అయినప్పటికీ కాంగ్రెస్ సంక్షేమ ఎజెండాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి కర్ణాటకలో విజయం సాధించింది. పార్టీలు గెలుపోటములు సహజమే. కానీ బీజేపీ అలాకాదు. గడిచిన కొన్ని దశాబ్దాలుగా హిందూత్వమే తన ఎజెండాగా చేసుకున్నది. ఇతర పార్టీల నాయకులు సైతం ఇన్నాళ్లు తామూ దేవుళ్లకు మొక్కుతున్నా.. తమలో హిందూ కోణం బలంగా ఉన్నా%ౌ%బయటకు కనిపించనీయలేదు. ఇప్పుడు అనివార్యంగా రాజ్యంగాన్ని, రాజ్యాంగ ఆత్మను ప్రతిఫలింపజేస్తూనే హిందూ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ప్రధాన జాతీయపార్టీయే కర్ణాటక ఎన్నికల పుణ్యమా అని హనుమాన్ చాలీసా జపిస్తూ ముందుకు పోతున్న పరిస్థితుల్లో ఇదే తోవలో ఇతర పార్టీలు కూడా వెళ్తే ఇక దేశ రాజకీయాల్లో ఏం మిగులుతుంది అనే ప్రశ్న తలెత్తుతుంది. మరోవైపు, మతపరమైన భావోద్వేగాలకు తావులేని రాజకీయాలు తెరపైకి బలంగా వచ్చే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇవన్నీ బీజేపీకి ముందు ముందు ఇబ్బందులు కలిగించే విషయాలే. తెలంగాణ సీఎం కేసీఆర్ యజ్ఞాలు, యాగాలు చేశారు. వాటిలో ప్రజలను భాగస్వాములను చేసే ప్రయత్నం చేశారు. అంతేకాదు ప్రతీ సందర్భంలోనూ తనకున్న దైవభక్తిని లోకానికి చాటి చెప్పారు. యాదాద్రి నిర్మాణమూ ఇందుకు మంచి నిదర్శనం. యాదగిరిగుట్టలో ఒక అద్భుత మందిరాన్ని పునర్ నిర్మించారు. మరోపక్క వేములవాడ రాజన్న, భద్రాద్రి రామయ్య, కొండగట్టు అంజన్న దేవాలయాల పునరుద్ధరణకు కోట్లాది రూపాయలు కేటాయించి హైందవ సమాజం పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటి చెప్పారు. అందువల్లనే తెలంగాణలో ఎవరెన్ని చెప్పినా అభివృద్ధి%ౌ%దైవభక్తి ఈ రెండింటికీ ఆయన బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. దాంతోపాటు భారత రాజ్యంగ ఆత్మను పాలనలో, విధానాల్లో ప్రతిఫలించేలా చేశారు. కనుకనే తిరుగులేని నాయకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. రాజ్యంగం పౌరులకు ప్రసాదించిన అన్ని రకాల హక్కులను రక్షించే విధంగా తెలంగాణాలో పాలన సాగుతున్నది. అందుకే ఇక్కడ బీజేపీ భావోద్వేగాల ఎజెండా ప్రభావం చూపించలేని స్థాయికి చేరుకుంది. ఇక కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణపైనా, భారత రాజకీయాలపైనా ఉంటుందనే చర్చ కూడా జోరుగా సాగుతున్నది. మొదట తెలంగాణ విషయాన్నే తీసుకుంటే ఆ రాష్ట్ర ఎన్నికల ఫలితాల ప్రభావం ఇక్కడ ఉండదు. పక్క పక్కనే ఉన్నప్పటికీ కూడా అది సాధ్యం కాదు. ఇక్కడ కుల, మత ప్రాతిపాదికన రాజకీయాలు లేవు. ఉండవు. వాటికి స్థానం లేదు. పైగా ప్రజల మౌలిక సమస్యలను ఈ ప్రభుత్వం అడ్రస్ చేసింది. చేస్తున్నది. ప్రజాలోచనలకు దగ్గరగా ఇక్కడి పాలన ఉన్నది. కనుక ఆ ప్రభావం ఉండే అవకాశమే లేదు. దక్షిణాదిలో బీజేపీ విస్తరణ కర్ణాటక ఫలితాలతో తేలిపోయింది. ఉత్తరాది పార్టీగా తనపై ఉన్న ముద్రను చెరిపేసుకునేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద అడ్డుకట్ట పడినైట్లెంది. దక్షిణాదిలో ఉన్న ఒక్క రాష్ట్రం కూడా బీజేపీ ఖాతాలో నుంచి చేజారిపోయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో రాష్ట్రాల్లో తాము విస్తరిస్తామని ఇన్నాళ్లు చాలా ఆశలు పెట్టుకున్నారు కమల నాథులు. అవన్నీ తలకిందులయ్యాయి. కర్ణాటకలో ఉన్న కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల అక్కడ బీజేపీ చాలా కాలం నిలువ గలిగింది. కానీ, ఆ రాష్ట్రంలో కూడా ప్రజ లు ఆ పార్టీని, అది చేసే మతపరమైన రాజకీయాల్ని అర్థం చేసుకొని దూరం పెట్టారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై కర్ణాటక ఫలితాల ప్రభావం ఉంటుందా అంటే తప్పకుండా ఉంటుంది. ఎందుకంటే, కర్ణాటక ఎన్నికల్ని ఒక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలుగా బీజేపీ తీసుకోలేదు. ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా, నడ్డా లాంటి నాయకులు కర్ణాటకలో పదుల సంఖ్యలో సభలు నిర్వహించారు. మోదీ భావోద్వేగపు ఉపన్యాసాలిచ్చారు. బజరంగ్‌దళ్‌పై నిషేధం విధిస్తామన్న కాంగ్రెస్ ప్రకటనను బలంగా జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. హానుమాన్ చాలీసా చదివారు. దీన్నో ఉద్యమంగా దేశంవ్యాప్తం చేస్తామని చెప్పారు. ఈ విధంగా ఒక రాష్ట్రానికి పరిమితం కావాల్సిన ఎన్నికలకు బీజేపీ వాళ్లే దేశవ్యాప్త స్థాయి ఇచ్చారు. కాబట్టి, దాని ఫలితాన్ని కూడా ఆ పార్టీనే అనుభవించాల్సి ఉంటుంది. కర్ణాటక ఎన్నికల ఫలితాల నేపథ్యంలోనైనా బీజేపీ మారుతుందా? తన మత రాజకీయాలను, ప్రజల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలను వదిలిపెడుతుందా? ఇకనైనా రాజ్యంగం పరిధిలో వ్యవహరిస్తుందా? ప్రజల సమస్యల పరిష్కారం దిశగా ఆలోచిస్తుందా? ఎజెండాను మార్చుకుంటుందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బీజేపీ ఆ పని చేయకపోతే భారతదేశం చూస్తూ కూర్చోదు. 75 ఏండ్ల ప్రస్థానంలో అనేక పరిణామాలను ఈ దేశం చూసింది. ఇందిర వంటి నియంతలనే ఓడించి, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునఃప్రతిష్టించుకున్న చరిత్ర ఈ దేశానికి ఉంది. కర్ణాటక ఫలితాల నేపథ్యంలో, బీజేపీ యేతర పక్షాలు కూడా ప్రజల ఎజెండానే ముఖ్యమనే విషయాన్ని గుర్తించాలి. ప్రజల సమస్యల పరిష్కారానికి పని చేసే పార్టీలను ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుంటారు. చరిత్ర దానిని అనేకమార్లు రుజువు చేసింది.

# మోడీ హయాంలో మత స్వేచ్ఛకు ప్రమాదం



బిజెపి ఇతర రాజకీయ పార్టీల లాంటిది కాదు. ఈ పార్టీని ఏర్పాటు చేసినది, నడుపుతున్నది... రాజ్యాంగాన్ని గుర్తించని లేదా ఆమోదించని ఆర్‌ఎస్‌ఎస్ అనే మత సంస్థ. ఈ సంస్థ దృష్టిలో 'హిందూ మత విశ్వాసాలను ఆచరించని వారంతా విదేశీయులు. అందువల్ల వీరంతా హిందూ మత జాతీయ సంస్కృతినీ, భాషనూ తమదిగా స్వీకరించి, ఆచరించాలి లేదా దేశంలో అమలవుతున్న అన్ని నీతి నియమాలకు, కట్టుబాట్లకు లోబడి వారి కృపాకటాక్షాలతో ఏ హక్కులు లేని పరాయివారిగా బతకాలి.' ఈ వికృత సిద్ధాంతాన్ని అమలు చేయాలని తహతహలాడుతున్న పాలకులకు పరమత సహనం, మత స్వేచ్ఛ అనేవి ఏ మాత్రం గిట్టవు. మన రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛ పరిస్థితులు దిగజారాయని, ఇందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతపరమైన వివక్షాపూరిత విధానాలే కారణమని అంతర్జాతీయ మత స్వేచ్ఛ పరిస్థితులపై అమెరికన్ సంస్థ ఇటీవల విడుదల చేసిన వార్షిక నివేదిక వెల్లడించింది. కర్ణాటక ఎన్నికల్లో ప్రజల తీర్పు, మహారాష్ట్రలో థాకరే ప్రభుత్వ కూల్చివేత-ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు, లైంగిక వేధింపులపై రెజ్లర్లు ఢిల్లీలో చేస్తున్న ఆందోళన, ఇప్పుడు మత స్వేచ్ఛపై అంతర్జాతీయ నివేదిక కేంద్రంలోని బిజెపి నేతలకు ఉక్కపోతను మరింత పెంచింది. నరేంద్ర మోడీ ఇంటా బయటా ఎదురులేని మొనగాడని, విశ్వగురువు అని, అంతర్జాతీయ శాంతిదూత అని...ఏవేవో భుజకీర్తులు తగిలించి, ఆహా ఓహో అని కీర్తించిన గోడీ మీడియా ఈ వరుస ఘటనలతో కుడితిలో పడిన ఎలుక లాగా గిజగిజలాడుతున్నది.

**మత స్వేచ్ఛ నివేదికలో ఏముంది ?**

అమెరికన్ విదేశాంగ శాఖ ఆధీనంలోని స్వతంత్ర సంస్థ 'యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడమ్' (యుఎస్‌సిఐఆర్‌ఎఫ్) ప్రపంచంలోని వివిధ దేశాల్లో మత స్వేచ్ఛ పరిస్థితులపై ప్రతి సంవత్సరం నివేదికలు రూపొందించి అక్కడి ప్రభుత్వానికి అందచేస్తుంది. భారతదేశంలో మత అసహనం, ప్రార్థనా స్థలాలు, మైనారిటీ ప్రజల ఆస్థులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, తప్పుడు కేసులు, నిర్బంధాలు పెరుగుతున్నాయని ఈ నివేదిక తెలిపింది. 2022లో దేశంలో జరిగిన సంఘటనలు, ప్రభుత్వ లెక్కల ఆధారంగా ఈ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించి మత స్వేచ్ఛ అమలు విషయంలో ప్రత్యేక ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న దేశాల జాబితాలో మన దేశాన్ని చేర్చాలని అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. గతంలో కూడా ఈ సంస్థ దేశంలోని మత ఉద్రిక్తతలను ప్రస్తావించింది. మత స్వేచ్ఛ విషయంలో కొనసాగుతున్న అనేక దుష్పరిణామాలను ఈ సంవత్సరం విడుదల చేసిన నివేదికలో ప్రస్తావించడంతో పాటు, వాటి మూలాలను విశ్లేషించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25-28 ప్రకారం ప్రతి పౌరుడికి తనకు ఇష్టమొచ్చిన మతాన్ని స్వీకరించడానికి, ప్రచారం చేసుకోవడానికి, ఏ మతాన్ని ఆరాధించకుండా వుండడానికి స్వేచ్ఛ వుంది. అయితే 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుండి ఈ లౌకిక సూత్రాలకు, మైనారిటీల మత స్వేచ్ఛకు ప్రమాదం ఏర్పడిందని పేర్కొంది. ఇంకా ఈ నివేదికలో 'హిజాబ్, గోవధ లాంటి అంశాలపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు (బిజెపి పాలిత రాష్ట్రాలు) రూపొందిస్తున్న చట్టాలు, న్యాయస్థానాల తీర్పులు దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు, దళితులు, ఆదివాసీల మత స్వేచ్ఛను హరించివేసే విధంగా వుంటున్నాయి. విమర్శనాత్మక గొంతులను కేంద్ర ప్రభుత్వం అణచిపెడుతున్నది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలను, వారికి అండగా నిలుస్తున్న వ్యక్తులను, సంస్థలను లక్ష్యంగా చేసుకొని వారిపై నిఘా, వేధింపులు, ఇళ్ల కూల్చివేత, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద సంవత్సరాల తరబడి నిర్బంధించడం లాంటివి పెరిగాయ'ని తెలిపింది. స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల ఆర్థిక మూలాలను దెబ్బతీసే విధానాలను కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగానే అమలు చేస్తున్నదని పేర్కొంది. మత స్వేచ్ఛ కోసం కృషి చేస్తున్న అనేకమంది జర్నలిస్టులు, లాయ ర్లు, మానవ హక్కుల కార్యకర్తలు నిర్బంధాలకు, వేధింపులకు గురవుతున్నారనే పచ్చి నిజాన్ని బయటపెట్టింది. 2019లో పౌరసత్వ చట్ట సవరణ బిల్లుకు నిరసనగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారనే సాకుతో అనేక వేల మందిపై పెట్టిన వందలాది కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో వున్నాయని, 2022 వరకు 700 కేసులు నమోదు కాగా, వాటిలో కేవలం 92 కేసులు మాత్రమే విచారణ దశకు వచ్చాయని తెలిపింది. అయితే ఈ కేసులు నమోదు అయినా అనేకమంది ఎలాంటి విచారణ లేకుండా సంవత్సరాలుగా జైళ్లలోనే మగ్గుతున్నారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో 12 రాష్ట్ర ప్రభుత్వాలు (ఉత్తరప్రదేశ్, కర్ణాటక, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, ఉత్తరా ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిషా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, జార?ండ్) మత మార్పిడిని చట్టవిరుద్ధ నేరంగా పరిగణించే చట్టాలను రూపొందించాయని ఈ నివేదిక తెలిపింది. చట్టపరమైన మత మార్పిడికి గతంలో వున్న నిబంధనలను పూర్తిగా మార్చివేసి మత స్వేచ్ఛను అణచివేసే విధంగా ఈ రాష్ట్రాల్లో నిబంధనలను రూపొందించారు. ఈ అంశాలన్నిట్లోనూ ఉత్తరప్రదేశ్ దూకుడుగా వుంది. మతాన్ని మార్చుకున్న వారికి, ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన వారికి భారీగా అపరాధ రుసుములు వేయడం, జైళ్లలో నిర్బంధించడం, వారి ఆస్తులు ధ్వంసం చేయడం పెరిగిందని పేర్కొంది. చట్టబద్ధ మతాంతర వివాహాలను నిరోధిస్తూ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాయి. ముస్లిం యువత చేసుకునే ప్రేమ వివాహాలపై 'లవ్ జిహాద్' పేరుతో ప్రజల్లో తప్పుడు ప్రచారం చేసి పాలకులు, వారి అనుయాయులు మత విద్వేషాన్ని పెద్ద ఎత్తున రగిలిస్తున్నారు. మతాంతర వివాహాలను పూజారి లేదా పోలీసులు అంగీకరించడానికి లేదా అంగీకరించకుండా వుండడానికి హక్కులు కల్పిస్తూ ఏప్రిల్‌లో హర్యానా ప్రభుత్వం చట్టాన్ని తెచ్చింది. కర్ణాటకలో రగిల్చిన హిజాబ్ సమస్య, గుజరాత్‌లో బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదల, ఉత్తరప్రదేశ్‌లో దళిత మహిళలపై కొనసాగుతున్న హత్యాచారాలు, దాడుల గురించి ఈ నివేదిక పేర్కొంది. పెరుగుతున్న మత హింస ఘటనల ఆధారంగా భారత దేశంలో మత స్వేచ్ఛ ప్రమాదంలో వుందని, అందువల్ల ప్రత్యేక ఆందోళనకర దేశాల జాబితాలో మన దేశాన్ని చేర్చాలని ఈ సంస్థ అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

**కేంద్ర ప్రభుత్వ స్పందన**

విభిన్న మతాలకు నిలయమై, లౌకిక విధాన పునాదిపై భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆచరిస్తున్న దేశ ప్రతిష్టను కేంద్ర బిజెపి పాలకులు, వారి మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఈ విధంగా దిగజార్చాయి. కానీ 'ఈ నివేదక పక్షపాతం మరియు నిందాపూర్వకమైనదని' మన విదేశాంగ మంత్రిత్వ శాఖ విమర్శించింది. తీవ్రమైన అవగాహనా లోపంతో ఈ నివేదిక తయారుచేయబడిందని కేంద్రం ఎదురు దాడికి సిద్ధమైంది. మరి ట్రంప్ అధ్యక్షుడుగా వున్న కాలంలో హౌడీ మోడీ, నమస్తే ట్రంప్ కార్యక్రమాల మోత మోగించారు కదా! అంతెందుకు! ప్రధాని మోడీ 2021 సెప్టెంబర్ నెలలో అమెరికా పర్యటన సందర్భంగా నాయకుల పరస్పర పొగడ్తలు, వచ్చే నెల 22న మరోసారి ప్రధాని అమెరికా పర్యటనకు చేస్తున్న హంగామా చూస్తూనే వున్నాం. అంతర్జాతీయ మీడియా ప్రచార హోరులో ఊయలలూగినప్పుడు పక్షపాతం గుర్తుకు రాలేదే? ఇలాంటి నివేదికలు ప్రకటించే అమెరికా సంస్థలన్నీ గొప్పవని, అవి ఇచ్చే నివేదకలన్నీ చాలా పవిత్రమైనవని అనుకోలేము. కాని తమను కీర్తించినప్పుడు ఒకరకంగా, నిందించినప్పుడు మరో రకంగా స్పందించే పాలకుల తీరు ప్రజావిశ్వాసాన్ని పొందదు.

**దేశంలో మత స్వేచ్ఛ ఎందుకు ప్రమాదంలో పడింది ?**

బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నది. ఒకటి మత రాజ్యాన్ని నిర్మించడం. అందుకోసం మత విద్వేషాన్ని నిత్యం రగల్చడం. ఇతర మతస్థుల ఆచార, సాంప్రదాయాలన్నిట్లోకి జొరబడి వాటిపై దాడి చేయడం. రెండు కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను, సామాజిక రిజర్వేషన్లను బలహీనపర్చడం, రాజ్యాంగ హక్కులను కాలరాయడం, రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేయడం. గౌతమ్ అదానీ ఆర్థిక అరాచకాల గురించి హిండెన్‌బర్గ్ నివేదిక, మత స్వేచ్ఛ గురించి యుఎస్‌సిఐఆర్‌ఎఫ్ నివేదిక, అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు ప్రకటిస్తున్న ర్యాంకింగ్ లెక్కలు ఈ విధానాల ప్రతిరూపమే. అంతేగాక, తమ మతతత్వ విధానాలను అమలు పరచడానికి మత చిహ్నాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఉదా: గో సంరక్షణ పేరుతో 2014 నుండి దేశవ్యాపితంగా 147 దాడులు జరిగాయి. ఇందులో 58 మంది హత్యగావించబడ్డారు. కర్ణాటక ఎన్నికలకు ముందు గో రక్షణ దళాలు ఇద్దరు మైనారిటీ మతస్థులను చంపడం, ఒకరిని హింసించడం చూశాము. కేంద్ర ప్రభుత్వం 2017 మే లో కేంద్రం గోవధ నిషేధాన్ని ప్రకటించింది. అన్య మత పూజా ప్రదేశాల మీద దాడులు చేయడం పెరిగింది. శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా దేశంలో అనేక చోట్ల మసీదులపై దాడులు జరిగాయి. ఈ సందర్భంగానే యు.పి లో మైనారిటీ సంస్థ నిర్వహిస్తున్న అతి పెద్ద ప్రాచీన గ్రంథాలయాన్ని తగుల బెట్టారు. మత మార్పిళ్ల సాకుతో ముఖ్యంగా క్రిస్టియన్లపై దాడులు పెరిగాయి. అసత్యాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పరమత సహనమే హిందూ మతానికి జీవం అని ఒకవైపున అనుభవం చెబుతుంటే, మరోవైపున హిందూ ధర్మ సంరక్షకులు, గో సేవా దురంధరుల వేషాలు వేసుకున్న కొద్దిమందికి పరమత ద్వేషం జీవగర్ర అయింది. వీరికి కేంద్రంలోని ప్రభుత్వం అండగా నిలిచింది. బిజెపి ఇతర రాజకీయ పార్టీల లాంటిది కాదు. ఈ పార్టీని ఏర్పాటు చేసినది, నడుపుతున్నది...రాజ్యాంగాన్ని గుర్తించని లేదా ఆమోదించని ఆర్‌ఎస్‌ఎస్ అనే మత సంస్థ. ఈ సంస్థ దృష్టిలో 'హిందూ మత విశ్వాసాలను ఆచరించని వారంతా విదేశీయులు. అందువల్ల వీరంతా హిందూ మత జాతీయ సంస్కృతినీ, భాషనూ తమదిగా స్వీకరించి, ఆచరించాలి లేదా దేశంలో అమలవుతున్న అన్ని నీతి నియమాలకు, కట్టుబాట్లకు లోబడి వారి కృపాకటాక్షాలతో ఏ హక్కులు లేని పరాయివారిగా బతకాలి.' ఈ వికృత సిద్ధాంతాన్ని అమలు చేయాలని తహతహలాడుతున్న పాలకులకు పరమత సహనం, మత స్వేచ్ఛ అనేవి ఏ మాత్రం గిట్టవు. దేవనూరు మహదేవ అన్నట్లు 'భారత దేశంలో ద్రవిడ, ఆర్య, ఇస్లాం, క్రైస్తవ రక్తాలన్నీ వేరుచేయలేనంతగా కలిసిపోయాయి.' వీటిని విడదీయాలని చూడడం అనాగరికం, ఆటవికం. కాని అనేక కారణాల వల్ల ప్రజలు ఈ విధ్వంసకులకు కొద్ది కాలం మద్దతు ఇవ్వవొచ్చుగాక. అనుభవం నేర్పుతున్న పాఠాల నుండి...వీరికి సరైన సమయంలో సరైన గుణపాఠం ఆ ప్రజలే చెబుతారన్నది చరిత్ర చెప్తున్న సత్యం.

## నదితో కొంచెంసేపు

ఎక్కడి నుంచో చల్లని ఊసులను
మోసుకొస్తున్న గాలి
ఊర్లను నగరాలను చుట్టేస్తూ
ఒడ్డున కూర్చున్న వాళ్ళని పలకరిస్తూ
పయనమవుతున్నది
పడవ పడవకో కథ
అలలకూ సుడులకూ అనాది బంధం
తెడ్లను కదిలించే చేతలకు జవసత్వాలను
ఇస్తానని అలలతో స్వాగతిస్తుంటుంది నది
పిండార పోసిన వెన్నెలైనా
ఎండకు మెరిసిపోయే దిన రూపమైనా
నది నవ్వుల పసి పాపే అవుతుంది
కలతల భాషతో కలల భాష
భాష్పమో భావమో గుండె పండు కాదు
కన్నీళ్ళ సుడులేనా కలకాలం
నా నీళ్ళ సుడులు చూడమనేది నది
నలుపును తెలుపును నీలమయం చేసి
ఆకాశాన్ని ప్రతిబింబిస్తుంది
తన నొరుసుకుని నిలుచున్న చెట్ల వేళ్లను
ముద్దాడుతూ అమిత ప్రేమ కురిపిస్తుంది
పుట్టుక అర్థం అదే కదా!
కొండకు అద్దానికి అరతెర తీసిన అర్థమై
ఈ కాలుష్యాలకు హెచ్చరిస్తూ
కన్నతల్లి అవుతుంది నది!
దాహం తీర్చిన అలల చేతులూ నదివే
తనను దాటుతూ నడిచే నడకకు
తన నీటి చర్మం ఎండిందంటే బాటా తానే!
ఆవిరిగొనే గ్రీష్మం ఆర్తి దీర్చే వర్షం
భరింపుల వెనుక తను ఓ ఉదాహరణ
అవుతానంటుంది నది!
జలచరాలూ భూ చరాలూ
పొగసూరని మనసుతో విచ్చుకొనే
పచ్చి బాలింతల తానేనంటున్నది నది!
కలుషితం కానంతవరకు
తన నీరు చనుబాల తీరేనంటున్నది!
నదితో కాసేపు ఉంటే కాలం
చిరుజల్లులు కురిపిస్తుంది
పరమాణువు పరిణామం
పరమార్థపు పరిమాణం
ప్రశ్నలతో పసిగట్టమంటున్నది నది!
పొలం రెండు చేతుల కోసం చూసినట్టు
కలకాలం చూస్తానంటున్నది విచిత్రంగా
నది!

**డాక్టర్ కొండపల్లి నీహారిణి:**

# జీవిత సవాళ్లు ఎదుర్కొని..



పేదరికం, అత్తింటి వేధింపులు, భర్త హింస ఉంటే ఏ మహిళైనా కుంగిపోతుంది. కాని సవితా ప్రధాన్ మాత్రం వాటిని అధిగమించి చదువుకున్నారు. ఇద్దరు పిల్లల్ని పోషిస్తూనే ఉద్యోగ పోటీ పరీక్షలు రాశారు. ఉన్నత స్థాయిలో ఉద్యోగం సంపాదించాలన్న సంకల్పంతో ఎదురైన ప్రతి సవాలునూ ఎదుర్కొన్నారు. చివరికి సాధించారు. ఇప్పుడు మధ్యప్రదేశ్ అర్బన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. తనలాగా ఎవరూ వేధింపులకు గురి కాకూడదని మహిళల కోసం ఓ ఛానెల్ నడుపుతూ చైతన్య పరుస్తున్నారు.

మధ్యప్రదేశ్‌లో మండై గ్రామానికి చెందిన సవితా పేద కుటుంబంలో పుట్టింది. ఐదుగురు సంతానంలో ఆమె ఒకరు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. దగ్గర్లో ఉన్న అడవిలోకి వెళ్లి టెండు ఆకులు, మహువ పూలు సేకరించి అమ్మేవారు. సవితాకు చిన్నప్పటి నుంచి చదువు అంటే ఇష్టం. కాని పాఠశాలకు పంపే స్థోమత తమకు లేదంటూ తల్లిదండ్రులు పంపేవారు కాదు. చదువుకుంటే రూ. 75 స్కాలర్‌షిప్ వస్తుందని, దాంతో కావాల్సిన పుస్తకాలు కొనుక్కుంటా అని గొడవపడి మరీ పాఠశాలకు వెళ్లింది. ఒక యూనిఫాం ఒంటి మీద ఉంటే మరో యూనిఫాం ఉతుక్కునేది. ఇంట్లో రోజూ పొందే దలియా (గంజి) చేసేవారు. ఒక్కోసారి అది ఉండేది కాదు. అయినా స్కూలుకు మాత్రం మానకుండా వెళ్లేది. ఆ తర్వాత 7 కి.మీ. దూరంలో పల్వేరాలో ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంది. రోజూ నడిచి వెళ్లి రావడం కష్టమవుతున్నా సవితా మాత్రం చదువు ఆపలేదు. ఆమె పట్టుదల చూసి కుటుంబమే ఆ ఊరికి మకాం మార్చింది. 22 మంది అబ్బాయిలున్న తన క్లాసులో ఇద్దరే అమ్మాయిలు. అయినా ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా స్కూలుకు వెళ్లింది. అలా ఆ ఊరిలోనే పదవ తరగతి చదివిన మొదటి అమ్మాయిగా పేరు తెచ్చుకుంది.


**వేధింపులు తట్టుకోలేక**

పై చదువులు చదివించే స్థోమత లేక తల్లిదండ్రులు సవితకు భోపాల్‌కు చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. అతను ఆమె కన్నా 11 ఏళ్లు పెద్దవాడు. పెళ్లయిన తర్వాత ఆమె జీవితం నరకప్రాయంగా మారింది. అత్తమామలు ఆమెను పనిమనిషిలా మార్చారు. సరిగ్గా తిండి పెట్టేవారు కాదు. ఆకలి తట్టుకోలేక చపాతీలు బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి తిన్న సందర్భాలూ ఉన్నాయి. మాట్లాడినా, నవ్వినా తిట్టేవారు. ఆమెను టీవీ చూడకుండా బంధించేవారు. బాధలు తట్టుకోలేక చనిపోదాం అనుకుంది. వెంట వెంటనే ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. దాంతో ఆత్మహత్య ప్రయత్నాలు మానుకుంది. భర్త పిల్లల్నీ హింసించడంతో చివరకు తట్టుకోలేక వారిని తీసుకుని పుట్టింటికి వచ్చింది.

**పని చేస్తూ...చదువు**

తల్లిదండ్రులు, తోడబుట్టిన వారు సవితకు మద్దతుగా నిలిచారు. వారి సహకారంతో మళ్లీ చదువు కొనసాగించింది. డిగ్రీలో చేరింది. ఇంటి దగ్గర చిన్నపిల్లలకు ట్యూషన్ చెబుతూ, బ్యూటీపార్లర్లో పని చేస్తూ తన పిల్లల్ని పోషించింది. అప్పుడు రాష్ట్ర సివిల్ సర్వీసెస్ గురించి తెలిసి ఆ వైపుగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. దానికి సంబంధించిన మెటీరియల్, జనరల్‌నాలెడ్జీ బుక్స్ తెచ్చుకుని ఇంట్లోనే చదువుకున్నారు. ఆమె ఎదుగుదల తట్టుకోలేక అత్తింటి వారు వచ్చి దాడి చేశారు. అయినా సవితా తట్టుకుని నిలబడ్డారు. ఎన్నో ఇబ్బందులు పెట్టిన భర్త నుంచి విడాకులు తీసుకొంది. అప్పుడు సవితాను చుట్టూ ఉన్నవారు రకరకాలుగా మాటలు అన్నారు. 'ఇద్దరు పిల్లలు ఉన్నా... భర్తను వదిలేస్తున్నావా?' అని అడిగి ఇబ్బంది పెట్టేవారు. అవేమీ ఆమె పట్టించుకోలేదు. చదువు మీద దృష్టికేంద్రీకరించారు. దాంతో 24 ఏళ్ల వయస్సులో చీఫ్ మున్సిపల్ అధికారిగా బాధ్యతలు చేపట్టింది. 2021లో ఖాండ్వా మున్సిపల్ కార్పొరేషన్‌కి తొలి మహిళా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు ప్రస్తుతం పట్టణ పరిపాలన విభాగంలో రాష్ట్ర మొదటి మహిళా జెడిగా బాధ్యతలు తీసుకుని ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. అత్తింటి వేధింపులకు గురవుతున్న మహిళల కోసం ఏకంగా 'హిమ్మత్ వాలీ లడ్కియాన్' (బ్రేవ్ గర్ల్స్) అనే యూట్యూబ్ ఛానెల్‌ని నడుపుతున్నారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తూ అండగా నిలుస్తున్నారు.

# ఉమ్రన్ మాలిక్‌తో క్యాంపస్ యాక్టివ్‌వేర్ జట్టు




న్యూఢిల్లీ : స్పోర్ట్స్ అండ్ అథ్లెయిజర్ ఫుట్‌వేర్ బ్రాండ్‌లలో ఒక్కటైన క్యాంపస్ యాక్టివ్‌వేర్ తమ నూతన నైట్రోఫ్లై శ్రేణీ విడుదల చేయటం కోసం ప్రముఖ బౌలర్ ఉమ్రాన్ మాలిక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. అసాధారణమైన ప్రదర్శన, తిరుగులేని నిబద్ధత కలిగిన క్రికెటర్ ఉమ్రాన్ మాలిక్ క్రీడల పట్ల తన అభిరుచి, నైపుణ్యంతో నైట్రోఫ్లైకు విస్తృత ప్రచారం తీసుకురానున్నారని ఆ సంస్థ విశ్వాసం వ్యక్తం చేసింది.

# ఆక్వాకు 'కోతల' వెతలు

## విద్యుత్ కోతలతో ఇబ్బందుల్లో రొయ్యల సాగు
## డీజిల్ ఇంజన్లతో ఏరియేటర్లను నడపాల్సిన పరిస్థితి
## ఉభయ గోదావరి రైతులపై రోజుకు రూ.8 కోట్ల అదనపు భారం



ఏలూరు, : కరెంటు కోతలతో ఆక్వా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంటను కాపాడుకోవాల్సి వస్తుండడంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. గత 15 రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని ఆక్వా రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే నిండా మునిగిపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు కోతలను నివారించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్ష ఎకరాల్లో, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 55 వేల ఎకరాల్లో రొయ్యలు సాగవుతున్నాయి. వేసవిలో ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులతో రొయ్యల సాగు తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గకుండా చూడాలి. ఇందుకోసం ఏరియేటర్లను నిరంతరం ఆన్‌లో ఉంచాలి. ఇవి ఆగిపోతే ఆక్సిజన్ లెవెల్స్ తగ్గి రొయ్యలు చనిపోతాయి. ప్రస్తుతం ప్రభుత్వం రోజూ సుమారు నాలుగు గంటలపాటు అనధికారికంగా విద్యుత్ కోత విధిస్తోంది. దీంతో, విద్యుత్ బదులు డీజిల్ జనరేటర్ల ద్వారా ఏరియేటర్లను నడపాల్సి వస్తోంది. ఇందుకు ఒక ఎకరాకు గంటకు ఒక లీటరు డీజిల్ వినియోగించాల్సి వస్తోంది. ప్రస్తుతం లీటరు డీజిల్ ధర రూ.100 ఉంది. దీనితోపాటు నిర్వహణ ఖర్చు రూ.30 కలిపి రూ.130 చొప్పున గంటకు అదనపు ఖర్చవుతోంది. నాలుగు గంటలకు సుమారు రూ.520 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆక్వా రైతులపై రోజుకు సుమారు రూ.8 కోట్ల భారం పడుతోంది. ఆక్వా మేత ధర పెరగడం, రొయ్యలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంద కౌంట్ ధరను ప్రభుత్వం రూ.245కు కొనుగోలు చేయాలని నిర్ణయించినా ఎక్కడా అమలు కావడం లేదు. రొయ్యల సాగుకు ఎకరాకు రూ.4 లక్షలు పెట్టుబడి అవుతుంది. వంద రోజుల్లో పంట చేతికొస్తుంది. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధిక పంట 50 నుంచి 60 రోజుల మధ్యలో ఉంది. గతేడాది నవంబరులో అధిక వర్షాలు, డిసెంబర్, జనవరిలో విపరీతమైన చలి కారణంగా వైరస్‌లు విజృంభించాయి. వేల ఎకరాల్లో రొయ్యల పంట నష్టాల బాట పట్టింది. ఈ నేపథ్యంలో గంపెడాశలతో రైతులు వేసవి సాగును ప్రారంభించగా విద్యుత్ కోత గోరు చుట్టుపై రోకలిపోటులా మారింది. సాగు ఖర్చు పెరుగుతుండడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పిల్లల చూపులన్నీ 'శిక్షా' కోసమే..



ముదురు నీలం రంగు గౌను, ఆకాశ నీలం రంగు చొక్కా తొడుక్కుని తెల్లరిబ్బన్లతో రెండు జడలు వేసుకుని భుజాన బ్యాగు, బెల్టు, టైతో 'శిక్షా' క్లాసు రూంలోకి అడుగుపెడితే చాలు.. అక్కడి పిల్లలందరూ ఆమె చుట్టూ గుమిగూడతారు. మెరుస్తున్న కళ్లతో అందరి ముఖాలు ఆమెనే చూస్తుంటాయి. అంతేనా.. చుట్టూ చేరిన పిల్లలంతా ఆమె వల్లె వేయించే పాఠాలకు శృతి తప్పకుండా స్వరం కలుపుతారు. పిల్లలను ఇంతలా మంత్రముగ్ధులను చేస్తున్న 'శిక్షా' గురించి ఒక్కమాటలో చెప్పాలంటే పిల్లల దృష్టిలో ఆమె ఓ అద్భుతం. ఎందుకంటే 'శిక్షా' అమ్మాయి కాదు.. రోబో.. ముప్పై ఏళ్ల అక్షయ్ మష్లేకర్ కలల ప్రాజెక్టు 'శిక్షా'. 'పట్టణాలు, నగరాల్లో విద్యార్థులకు విద్యాభ్యాసమంతా అధునాతన వసతుల మధ్య సాగుతుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో అలా కాదు. చేతితో తయారుచేసిన కాగితపు చార్ట్‌లు, బ్లాక్స్‌లతోనే వారి విద్యాభ్యాసం సాగాలి. కంప్యూటర్లు, లాప్‌టాప్‌ల ఊసే ఉండదు. అటువంటి చోట శాస్త్రసాంకేతికతతో ఎటువంటి అద్భుతాలు సాధించవచ్చో తెలియజేయాలనుకున్నాను. 'శిక్షా'ను పరిచయం చేసి శాస్త్రీయ విజ్ఞానం వైపు పిల్లలను ఆకర్షించాలన్నదే నా లక్ష్యం' అంటున్నారు అక్షయ్.

**ప్రాథమిక విద్య నేర్పిస్తుంది..**

'అక్షరాలు, పద్యాలు, పదాలు, ఎక్కాలు వంటి ప్రాథమిక అభ్యసన పాఠాలను 'శిక్షా' అనర్గళంగా చెప్పేస్తుంది. మధ్య మధ్యలో పిల్లలను ప్రశ్నిస్తుంది. లయబద్ధంగా తల ఊపుతూ వారితో ఆ పదాలను, పద్యాలను వల్లె వేయిస్తుంది. మా అమ్మ ఉపాధ్యాయిని కావడం వల్ల చిన్నప్పటి నుండే టీచరు కావాలని అనుకునేవాడ్ని. ఉన్నతవిద్య అభ్యసించి కాలేజీ ప్రొఫెసర్ అయ్యాను. కోరుకున్న ఉద్యోగం దొరికి తృప్తిగా ఉన్నా విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాలని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడ్ని. సమయం దొరికేది కాదు. అయితే లాక్‌డౌన్ కాలంలో మా గ్రామానికి తిరిగి వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులు నన్ను ఆలోచనల్లో పడేశాయి. ప్రపంచమంతా సాంకేతికంగా ఎంతో ముందుకుపోతున్నా గ్రామాల్లో మాత్రం ఇప్పటికీ పాత పద్ధతుల్లోనే విద్యాభ్యాసం కొనసాగుతోంది. ఆ పిల్లల కోసం ఏదైనా వినూత్నంగా చేయాలని అప్పుడే అనుకున్నాను. ఆరు నెలలు దీనిపైనే దృష్టి పెట్టాను. ఆ ఆలోచనలే 2022లో 'శిక్షా'గా రూపాంతరం చెందాయి' అని చెబుతున్నారు అక్షయ్.

'మన దేశంలో విద్యావ్యవస్థ చాలా దారుణంగా తయారైంది. విద్యార్థులకు సరిపడా టీచర్ల నియామకం లేదు. ఈ పరిస్థితి టీచర్లపై ఒత్తిడి తెస్తోంది. ఫలితంగా విద్యార్థుల చదువు ప్రభావితమౌతోంది. అంటూ ఆవేదనగా చెబుతున్న అక్షయ్ ఉత్తర కర్నాటక 'సిర్సి'లో జన్మించారు. మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చినా ఓ బృహత్తర లక్ష్యం కోసం పనిచేశారు. 'శిక్షా' కోసం రూ.2 లక్షలు ఖర్చు చేశారు. శిక్షా'లో అనేక పార్శ్వాలు ఉండేలా డిజైన్ చేశారు. ఖర్చు తగ్గించుకునేందుకు అధిక మొత్తంతో కూడిన పరికరాలే కాక, ప్లాస్టిక్ క్రికెట్ స్టంప్స్ లాంటివి కూడా ఉపయోగించారు.

**ఇలా పనిచేస్తుంది...**

'అన్ని హంగులతో తయారైన 'శిక్షా' కన్నడ, ఇంగ్లీషుల్లో పాఠాలు చెప్పగలదు. వారాల పేర్లు, రకరకాల ఆకారాలు, ఆంగ్ల అక్షరాలు, గణిత పాఠాలు, గుణకారాలు, కూడికలు, తీసివేతలు వంటివన్నీ చెప్పేస్తుంది. ఇందులో ప్రధానంగా రెండు కార్డులను ఉపయోగిస్తున్నాం. మాస్టర్ కార్డుతో దీన్ని అన్‌లాక్ చేస్తాం. నార్మల్ కార్డుతో పనిచేయడం ప్రారంభిస్తుంది. మాస్టర్ కార్డును 'శిక్షా' చేతిమీద పెట్టగానే ప్రోగ్రామింగ్ అడుగుతుంది. అప్పుడు సబ్జెక్టు వారీగా డిజైన్ చేసిన కార్డులను శిక్షా చేతిలో పెడితే ఆ కార్డును దాని భుజాల వరకు తీసుకెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన స్కానర్‌లో స్కాన్ చేసుకుని పని మొదలుపెడుతుంది' అని 'శిక్షా' ఎలా పనిచేస్తుందో చెబుతున్నారు అక్షయ్.

**సైన్సుపై ఆసక్తి పెరిగింది..**

ఇప్పటి వరకు గ్రామీణ కన్నడనాట 25 స్కూళ్లలో 'శిక్షా' పాఠాలు చెప్పింది. కెహెచ్‌బి స్కూలు, ఉర్దూ పాఠశాలలకు సైతం వెళ్లింది. 'శిక్షాను తీసుకుని అక్షయ్ మా స్కూలుకు ఏప్రిల్‌లో వచ్చారు. 'శిక్షా'ను చూడగానే మా పిల్లలందరూ చాలా ఆశ్చర్యపోయారు. ఎంతో ఆసక్తిగా దాన్ని చూశారు. వాళ్ల దృష్టిలో శిక్షా రోబో మాత్రమే కాదు.. అది వాళ్ల స్నేహితురాలు.. ఎందుకంటే అది కూడా తమలాగే యూనిఫాం వేసుకుని స్కూలుకు వచ్చింది' అని చెబుతున్నారు మోడల్ స్కూల్ టీచర్ సునయన. ఇంకా 'శిక్షాను చూసిన తరువాత చాలామంది పిల్లలు సైన్స్ చేసే అద్భుతాల గురించి తెలుసుకోవడం ప్రారంభించారు. పిల్లల్లో వచ్చిన ఆ మార్పు నాకు చాలా స్పష్టంగా కనిపించిందని' ఆమె అంటున్నారు.

**యువ శాస్త్రవేత్తల కోసమే..**

'శిక్షాను క్లాసు రూంలోకి ప్రవేశపెట్టడం వెనుక పిల్లలకు రోబోను పరిచయం చేయడమే కాదు.. వాళ్లతో కొత్త రోబోలను తయారుచేయించడం కూడా. ఇందుకోసం ఓ రీసెర్చ్ సెంటర్‌ను కూడా ప్రారంభించాను. యువ రోబో శాస్త్రవేత్తలకు అందులో ప్రవేశం ఉచితం. సిర్సిలో ఏర్పాటు చేసిన ఈ పరిశోధానా కేంద్రాన్ని రోజుకు 200 మంది పిల్లలు సందర్శిస్తున్నారు. వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెబుతూ వారి ఆలోచనలను మరింత పదునుబెడుతున్నాను. 'శిక్షా' ఖర్చు తగ్గించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలనుకుంటున్నాను. సుమారు రూ.35 వేలకు తగ్గించాలని ప్రయత్నిస్తున్నాను. వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్న 'శిక్షా' మున్ముందు మరింతమంది పిల్లలకు చేరువ అవ్వాలి' అని కోరుకుంటున్న అక్షయ్ నిర్వహిస్తున్న రీసెర్చ్ సెంటర్ గురించి మరిన్ని వివరాలు కావాలంటే 74832 76508 నెంబరుకు ఫోను కాల్ చేయవచ్చు.

# పిల్లలను ఫోనుకు దూరంగా ఉంచండి!

పిల్లలైనా, పెద్దలైనా స్మార్ట్‌ఫోను అదేపనిగా చూడడం మంచిది కాదు. ఈ అలవాటు వల్ల మానసిక సమస్యలతో పాటు శారీరకంగా కూడా చేటు కలుగుతుంది. అమెరికాకు చెందిన సేపియన్ ల్యాబ్స్ అనే ఓ స్వచ్ఛంద సంస్థ సర్వే ప్రకారం... పిల్లలకు స్మార్టఫోన్లు ఇస్తే వారిని మానసిక అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని స్పష్టమైంది. మహిళలకు ఈ స్మార్ట్‌ఫోన్ల దుష్ప్రభావం అధికమని కూడా ఆ పరిశోధనలో తేలింది. భారత్ సహా 40 దేశాల నుంచి 27,969 మంది డేటాను సమీకరించి ఈ సర్వే చేశారు. వారిలో 4 వేల మంది భారతీయులు కూడా ఉన్నారు. ఆందోళన కలిగించే విషయమేమంటే ... ఆరేళ్ల నుంచే స్మార్ట్‌ఫోన్లు కలిగిఉన్న పిల్లల్లో ఆత్మహత్య ఆలోచనలు అధికంగా ఉంటాయని పరిశోధనలో గుర్తించారు.స్మార్ట్‌ఫోన్లు వినియోగించడం వల్ల పిల్లల స్వభావాల్లో వస్తున్న మార్పును కూడా ఈ సర్వే అంచనా వేసింది. చిన్న వయసులోనే స్మార్ట్‌ఫోన్‌ను సొంతం చేసుకున్న వారిలో దుందుడుకు స్వభావం అధికంగా ఉన్నట్టు తేలింది. ఆరేళ్ల వయసులోనే మొబైల్ ఫోన్లు కలిగిన బాలికల్లో ఇతరులతో పోలిస్తే మానసిక ఆరోగ్య సమస్యలు అధికంగా వేధిస్తున్నట్టు కనుగొన్నారు. బాలురలో ఆరేళ్ల నుండే స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వారిలో 42 శాతం మంది, 18 ఏళ్లకు స్మార్ట్‌ఫోన్‌ను కలిగిఉన్న వారిలో 36 శాతం మంది మానసిక అలజడిని ఎదుర్కొంటున్నట్లు పరిశోధకులు తెలిపారు. అల్లరి చేస్తున్నారనో.. పనులకు అడ్డం వస్తున్నారనో.. చిన్న పిల్లలకు ఫోన్లు ఇవ్వడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. పిల్లల్లో సహజంగా పెరిగే ఆలోచనలకు పదునుబెట్టాలి. వారిలో దాగున్న నైపుణ్యాలను వెలికితీసి వారి శక్తిసామర్థ్యాలను పెంచడంలో తల్లిదండ్రులు కీలకబాధ్యత వహించాలి. ఈ సర్వే వివరాలు తెలుసుకున్న తరువాతైనా పిల్లలు ఫోను జోలికి పోకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులే తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## సమ్మర్‌లో ఆరోగ్యంగా ఉండాలా? అయితే ఈ ఫుడ్‌ను మీ డైట్‌లో చేర్చుకోవడం మస్ట్ !



మన పెద్దలు ప్రతి రుతువుకూ ఓ భోజన విధానాన్ని నిర్ణయించారు. వళ్లెంలో ఆయా పదార్థాలకు చోటు కల్పించడం ద్వారా ఎండ వేడిమిని తట్టుకోగలం. పొట్టను చల్లగా ఉంచుకోగలం.

బీట్‌రూట్

వడగాడ్పులు ప్రమాదకరం. కొన్నిసార్లు పక్షవాతానికి కూడా కారణం అవుతాయి. ఆ ప్రమాదం నుంచి బయటపడటానికి బీట్‌రూట్‌ను ఆశ్రయించాలంటారు నిపుణులు. ఇందులో ఫైబర్, బీటా–కెరోటిన్ అధికం.

పుదీనా

శరీరాన్ని చల్లగా ఉంచే స్వభావం దీని సొంతం. జీర్ణ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుతుంది. ఐరన్, పొటాషియం, విటమిన్–ఎ, బి–కాంప్లెక్స్ విటమిన్లు, ప్రొటీన్లు అపారం. ఊబకాయాన్ని నియంత్రించడంలోనూ సాయపడుతుంది.

తులసి

ఇందులో లేని సుగుణాలంటూ ఉండవు. యాంటీ ఆక్సిడెంట్, ఇమ్యూనిటీ బూస్టర్, నొప్పి నివారిణి.. మచ్చుకు కొన్ని. చల్లదనాన్నిచ్చే గుణమూ ఉంది.

టమాట

దీనిలోని లైకోపిన్ అతినీల లోహిత కిరణాల నుంచి రక్షిస్తుంది. వృద్ధాప్య లక్షణాలను దూరం చేస్తుంది. గుండె జబ్బులు, పక్షవాతం, జ్ఞాపకశక్తి లోపాలు నివారిస్తుంది.

యోగర్ట్

శరీరాన్ని తేమగా ఉంచుతుంది. చల్లదనాన్ని ప్రసాదిస్తుంది. వడదెబ్బను నివారిస్తుంది. శరీరానికి వేడి తగలకుండా అడ్డుకునే చల్లని నేస్తమిది.

## ఈ పండుతో ఆరోగ్య సమస్యలకు చెక్



దేశీ పండ్లు రుచిని పంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. సీజన్‌లకు అనుగుణంగా ఒక్కో ప్రాంతంలో ఒక్కో పండు ప్రసిద్ధి కాగా వీటిలో పోషకాలూ మెండు. రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ పండ్లలో ఫాల్సా పండ్లు ముందువరుసలో నిలుస్తాయి. ఈ పండ్లలో అనేక పోషక విలువలు ఉండటంతో ఇవి తక్షణ శక్తిని అందిస్తాయి.ఇండియన్ ఫర్బత్ బెర్రీగా పేరొందిన ఈ ఫ్రూట్‌కు సంబంధించిన మరిన్ని విషయాలను చూద్దాం. ఫాల్సా సులభంగా జీర్ణమయ్యే అనేక విటమిన్లు, మినరల్స్‌తో కూడిన పవర్‌హౌస్‌గా చెబతారు. ఈ పండ్లు తక్కువ కాలమే తాజాగా ఉండటంతో వీటిని వెంటనే తినడం మేలు. వేసవిలో డీహైడ్రేషన్ బారినపడుకుండా ఉండేందుకు ఈ పండును తీసుకోవడం శ్రేయస్కరం.ఫాల్సాలో నీటి శాతం అధికంగా ఉండటంతో ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు పరిమితంగా ఉండటంతో పాటు సింపుల్ షుగర్స్ ఉండటం వల్ల మధుమేహులు నిరభ్యంతరంగా ఈ పండ్లను తీసుకోవచ్చు. ఫాల్సాలో యాంటీఆక్సిటెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇక కొలజెన్ కంటెంట్ ఉండటంతో చర్మ సమస్యలు నివారించి చర్మ సౌందర్యం మెరుగుపడేందుకు మేలు చేస్తుంది. ఇక ఫాల్సా పండ్లతో ఆరోగ్య ప్రయోజనాలను పరిశీలిస్తే..రక్తహీనతకు చెక్. కీళ్ల నొప్పుల నివారణ, అదుపులో మధుమేహం, మలేరియా నివారణ, చర్మసౌందర్యం.

## చర్మం.. జాగ్రత్త తల్లీ!

మాతృత్వం ఓ వరం. బిడ్డ ఒడిలో పడగానే తల్లి పొందే ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. మాతృత్వం ఓ సవాలు. ఆ తొమ్మిది నెలలూ అనేక సమస్యలు ఎదుర్కొంటారు. చిరునవ్వుతో అధిగమిస్తారు కూడా. అలానే, ప్రసూతి తర్వాత ఇబ్బందిపెట్టే చర్మ సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. ప్రెగ్నెన్సీ సమయంలో సెబాసియస్ గ్రంథులు మరింత చైతన్యం అవుతాయి. దీంతో చర్మంపై మొటిమల్లాంటివి పుట్టుకొస్తాయి. ఒంట్లో తేమ తగ్గిపోయి, చర్మం పొడిబారుతుంది. కొందరిని జిడ్డు చర్మం వేధిస్తుంది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత చర్మం సహజంగానే వదులుగా మారిపోతుంది. పొట్టచుట్టూ, తొడల దగ్గర ప్రసూతి ముడతలు ప్రత్యక్షం అవుతాయి. మొహం మీద మచ్చలూ కనిపించవచ్చు. ఈ సమస్యలకు తగిన పరిష్కారాలూ ఉన్నాయి. చర్మవైద్యులను సంప్రదిస్తే.. ఔషధాలు, పైపూత మందులు ఇస్తారు. కాకపోతే, పిల్లలకు చనుబాలు ఇవ్వడానికి ముందు ఆ క్రీమ్‌లను శుభ్రం చేసుకోవడం ఉత్తమం. క్రీమ్ రాసుకున్న చేతులతో పిల్లలకు ఏదైనా తినిపించడమూ ప్రమాదకరమే. ముఖ్యంగా స్టెరాయిడ్స్ జోడించిన క్రీమ్‌లను ఛాతీకి పూసుకున్న సమయంలో పాలివ్వకపోవడమే మంచిది. కొందరికి కొన్ని మందులు పడకపోవచ్చు. ఈ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. తల్లి అనారోగ్యం బిడ్డలనూ ప్రభావితం చేస్తుంది.

# సర్జరీతో.. దర్జాగా నడవండి



కొన్ని అపోహలు జీవన నాణ్యతను దెబ్బతీస్తాయి. కొన్ని భయాలు రుగ్మతలకు మరింత దగ్గర చేస్తాయి. కొన్ని అశాస్త్రీయ భావనలు ఆధునిక వైద్యాన్ని మనకు అందకుండా చేస్తాయి. మోకీళ్ల శస్త్ర చికిత్సకు సంబంధించి కూడా ఎన్నో దుష్ప్రచారాలు. వాటన్నిటినీ అధిగమించి.. శస్త్ర చికిత్సకు సిద్ధపడితే.. మళ్లీ నడవవచ్చు, ఏ ఇబ్బందీ లేకుండా మెట్లు ఎక్కవచ్చు, నిటారుగా, సౌకర్యంగా నిలబడవచ్చు.

భరించలేనంతగా..

మోకీళ్ల నొప్పులు, కీళ్లు బిగుసుకుపోవడంతో నడవటం, నిలబడటం కూడా ఇబ్బందే అవుతుంది. దీనికి కారణం మోకాలు కీళ్లు దెబ్బతినడమే. అయితే, ఎంత వృద్ధులైనా కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సతో మంచిగా కోలుకోవచ్చు. చురుకుగా తిరగొచ్చు. పూర్తిగా పనిచేయలేని స్థితికి చేరిన కీలును తొలగించి, ఆ స్థానంలో కొత్తది అమర్చుతారు. ఇందుకు అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మరోమాట, కీళ్లమార్పిడికి వృద్ధాప్యం ఏమాత్రం అవరోధం కాదు.

మోకాళ్ల నిర్మాణం వైవిధ్యమైంది. ఆ భాగంలో రెండు ఎముకలూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. వాటిని కలిపి ఉంచే కీలు.. మోకాలు దిగువ భాగంలో కదలికకు తోడ్పడుతుంది. ఈ కదలిక సహజంగా జరగలేని పరిస్థితి ఏర్పడినప్పుడు.. కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స అనివార్యం. ఆ ఆపరేషన్ రోగిని తిరిగి సాఫీగా నడిపించగలుగుతుంది. సాధారణంగా ఆర్థోపెడిక్ సర్జన్లే కీళ్లమార్పిడి శస్త్రచికిత్స చేస్తారు. తీవ్రమైన ఆర్థరైటిస్, కీళ్లనొప్పులు, అంగవైకల్యాన్ని కూడా కీళ్లమార్పిడి ద్వారా సరిచేయవచ్చు. కీలు దెబ్బతినడంతో చాలామంది నడవలేరు, నిలబడలేరు, మెట్లెక్క లేరు, రోజువారీ పనులు చేసుకోవడంలోనూ ఇబ్బంది కలుగుతుంది. సాధారణ జీవితం గడపడానికి మోకీలు మార్పిడి ఒక్కటే మార్గం. కీళ్ల నొప్పుల సమస్యను పరిష్కరించడంలో డాక్టర్లు చేసే చిట్టచివరి ప్రయత్నమే కీళ్లమార్పిడి. సర్జరీ చేస్తున్నప్పుడు సమస్య తీవ్రతను బట్టి, అప్పటికే జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని.. అవసరమైతే కీలు మొత్తాన్నీ తొలగించాల్సి ఉంటుంది. ఇది వైద్యపరంగా తప్పనిసరి పరిస్థితి.

ఇలా ఎందుకు?

చాలా సందర్భాలలో.. కాలి ఎముకలను మృదువుగా కదిలేలా చేసే మృదులాస్థి (కార్టిలేజ్) అరిగిపోవడంతో తలెత్తే ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ కారణంగానే మోకాలు కీళ్లు పనిచేయలేని స్థితికి చేరుకుంటాయి. కొన్ని కుటుంబాలలో ఈ సమస్య వంశపారం పర్యంగా వస్తుంది. కీళ్లలోని ఎముకల చివరలో ఉండే మృదులాస్థిని చుట్టుముట్టే వ్యాధుల మూలంగా మోకీళ్ల సమస్యలు ఏర్పడుతాయి. నేరుగా కారణం కాక పోయినా, ఊబకాయం వల్ల మోకాళ్లపై భారం పెరిగిపోయి, కీలు దెబ్బతింటాయి. ఈ రకమైన ఆరోగ్య సమస్యల వల్ల కీళ్లు బలహీనపడిపోతాయి. క్రమంగా పనిచేయలేని స్థితికి చేరుకుంటాయి. రోజూ తాగే నీటిలోని కొన్ని ప్రమాదకర రసాయనాలు కూడా సమస్యకు ఓ కారణం కావచ్చు. వయసు పైబడిన కొద్దీ పరిస్థితి మరింత విషమిస్తుంది. చికిత్స ఆలస్యమైన కొద్దీ మోకాలు కీలులోని మృదులాస్థి, ఎముక పూర్తిగా దెబ్బతింటాయి.

కీలు మొత్తం మార్చాలి

ఆర్థరైటిస్ చివరిదశకు చేరుకున్న తర్వాత.. మందులతో ఉపశమనం సాధ్యం కాదు. అప్పటికే కీలు నిరుపయోగంగా మారిపోయి ఉంటుంది. అలాంటప్పుడు మొత్తం కీలును మార్చేసి.. మోకాలు కదలికను పునరుద్ధరించేలా కీళ్ల మార్పిడి సర్జరీ చేస్తారు. దీని ద్వారా దెబ్బతిన్న కార్టిలేజ్, ఎముక ఉపరితలాన్ని తొలగించి లిగమెంట్‌కు నష్టం ఏర్పడే పరిస్థితిని నివారిస్తారు. మార్పిడికి ఉపయోగించే కృత్రిమ కీళ్లను టైటానియం, కోబాల్ట్ క్రోమ్, స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి లోహాలతోనూబీ సిరామిక్, ప్లాస్టిక్ (పాలియిథిలిన్) వంటి పదార్థాలతోనూ తయారుచేస్తారు. ఈ కీలును ఎక్రిలిక్ సిమెంట్‌తో ఎముకకు అతికిస్తారు. లేదంటే బలంగా నొక్కి ఎముకకు బిగిస్తారు. తర్వాత ఫిజియోథెరపీ ద్వారా ఆ వ్యక్తికి తన కొత్త కీలును కదిలించడం క్రమంగా అలవాటు చేస్తారు.

నడక మునుపటిలా

కీలుమార్పిడి సర్జరీ చేయించుకున్న వారిలో మొదటి మూడు నెలల్లోనే చాలా మార్పు కనిపిస్తుంది. నొప్పి మటుమాయం అవుతుంది. సులువుగా లేచి నిలబడటం, కీళ్లు కదిలించడం సాధ్యపడుతుంది. ఆపైన ఆరు వారాల్లో చాలామంది రోగులు స్వేచ్ఛగా, ఎలాంటి ఆధారమూ లేకుండా నడవగలరు. కండరాలు గట్టిపడిన తర్వాత పరుగెత్తడం, దూకడం మినహా.. అన్ని రోజువారీ పనులనూ సునాయాసంగా చేసుకోగలరు. దాదాపు ఎనభై ఐదు శాతం కృత్రిమ కీలు ఇంప్లాంట్లు ఇరవై సంవత్సరాల వరకూ పనిచేస్తాయి. ఎప్పటికప్పుడు మెరుగుపడుతున్న కీళ్ల డిజైన్లు, వాటిని అమర్చే విధానాల వల్ల వీటి జీవితకాలం మరింత పెరుగుతూ వస్తున్నది. మోకాలు కీళ్ల మార్పిడి అనేది సంక్లిష్టమైన శస్త్ర చికిత్స. ఇందుకు చేయితిరిగిన ఆర్థోపెడిక్ సర్జన్లతోపాటు రుమటాల జిస్టులు, ఫిజియోథెరపీ నిపుణులు అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్యసంస్థను ఎంచుకోవాలి. ఆపరేషన్ తర్వాత రోగులు కీళ్లనొప్పి నుంచి విముక్తి పొంది, సాధారణ జీవితం గడపటంలో ఫిజియోథెరపీది చాలా ముఖ్యపాత్ర.

అన్నీ అపోహలే..

మోకీళ్ల సర్జరీ తర్వాత సాధారణ జీవితం గడపటం అసాధ్యమనే వాదనలో అర్థం లేదు. అత్యాధునిక వైద్య పరిశోధనల ఫలితంగా అనేక ఆవిష్కరణలు జరిగాయి. దీంతో మోకీలును తలపించే కృత్రిమ సాధనాలను తయారు చేసుకోగలుగుతున్నాం. మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ పుణ్యమాని.. పెద్ద పెద్ద కోతలూ ఉండవు. కాబట్టే, రోజుల్లోనే కోలుకుంటారు. నెలల వ్యవధిలోనే నడవగలుగుతారు. ఇక, బతికినంత కాలం ఫిజియోథెరపీ చేయించుకోవాలనే ప్రచారం వెనుకా శాస్త్రీయత లేదు. నెలల వ్యవధిలోనే పరిపూర్ణ ఆరోగ్యవంతులతో సమానంగా నడవగలుగుతున్నారు. కృత్రిమ అవయవాల తయారీకి ఉపయోగించే లోహాలు అలర్జీ కలిగిస్తాయన్న వాదన అర్థరహితం. శస్త్రచికిత్సకు ఆరోగ్యవంతమైన జీవనశైలి కూడా తోడైతే ఆనందంగా బతికేయవచ్చు. అపోహలతో, అనుమానాలతో, అకారణ భయాలతో శస్త్ర చికిత్సను వాయిదా వేయడం అంటే.. అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకోవడమే. కాబట్టి, దీర్ఘకాలికంగా మోకాలి నొప్పులు వేధిస్తున్నా, పట్టుమని పది నిమిషాలకు మించి నిలబడలేకపోతున్నా, ఐదారుమెట్లు కూడా ఎక్కలేని పరిస్థితి ఉన్నా, నొప్పి నివారణ మాత్రలు ఏమాత్రం పనిచేయకపోయినా.. వెంటనే నిపుణులను సంప్రదించాలి. ఆలస్యమైనకొద్దీ సమస్య సంక్లిష్టంగా మారుతుంది. బతుకు భారంగా అనిపిస్తుంది. అలాంటి జీవితం ఎవరికైనా ఇబ్బందికరమే.


వృద్ధాప్యం సమస్యే కాదు

ఎనభై ఐదేండ్ల జయలక్ష్మి దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్‌వారితో పోరాడారు. క్రమశిక్షణతో జీవిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వచ్చారు. కానీ, ముదిరిన ఆస్టియో ఆర్థరైటిస్ జయలక్ష్మికి సొంతంగా నిలబడలేని, నడవలేని పరిస్థితి కల్పించింది. పదిహేనేండ్లపాటు ఆ మొండి వ్యాధితో పోరాడారామె. చివరికి ఆధునిక శస్త్ర చికిత్సతో కీళ్లనొప్పులపై విజయం సాధించారు. ఆమె మోకాలు కీలు మొత్తాన్ని మార్చివేసే శస్త్రచికిత్స (టోటల్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీ టీకేఆర్) చేయించుకున్నారు. ఆస్టియో ఆర్థరైటిస్ కారణంగా తీవ్రమైన మోకాళ్ల సమస్య ఎదుర్కొంటున్న జయలక్ష్మికి టీకేఆర్ తప్ప ప్రత్యామ్నాయం లేదు. సాధారణంగా బాగా వృద్ధులైన వారికి ఈ సర్జరీ సాధ్యం కాదన్న అభిప్రాయం ఉంది. కానీ, అది నిజం కాదు. మొత్తం కీలును మార్చే శస్త్రచికిత్సల్లో అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. దీంతో పండు ముసలివారికి కూడా టీకేఆర్ చేయగలుగుతున్నాం.

రోబోటిక్ శస్త్రచికిత్స

మోకీళ్ల మార్పిడి విషయంలో రోబోటిక్ సాంకేతికత విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చింది. ఈ విధానంలో మరింత సురక్షితంగా, కచ్చితంగా చికిత్స అందించవచ్చు. ఇందులో రోబోటిక్ ఆర్మ్ వైద్యుడి మార్గదర్శకత్వంలో ఆపరేషన్ నిర్వహిస్తారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఈ విధానంలో నొప్పి తక్కువగా ఉంటుంది. రోగి తొందరగా కోలుకుంటాడు. ఒక్కొక్కరి మోకీళ్లు ఒక్కోలా ఉంటాయి. రోబోటిక్ సాంకేతికత ద్వారా ఎవరికి తగిన విధంగా వారికి శస్త్ర చికిత్స నిర్వహించడం సాధ్యమవుతుంది. ఈ ఫలితాలు ఎక్కువ కాలంపాటు నాణ్యమైన జీవితానికి హామీ ఇస్తాయి.

## 2030 నాటికి 50 లక్షలకు పెరగనున్న బ్రెయిన్ స్ట్రోక్ మరణాలు : జీవనశైలి మార్పులతో చెక్..!



బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకునే మరణాల సంఖ్య 2030 నాటికి 50 లక్షలకు పెరుగుతుందని తాజా సర్వే హెచ్చరించింది. 1990లో బ్రెయిన్ స్ట్రోక్ మరణాలు 20 లక్షలు కాగా 2019కి అది 30 లక్షలకు చేరిందని అధ్యయనం తెలిపింది. మెదడుకు రక్త ప్రసరణలో అడ్డంకులతో స్ట్రోక్ ముప్పు తలెత్తుతుంది.బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా మరణాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని అయితే వీటిని నివారించవచ్చని షాంఘైలోని టాంగ్జి యూనివర్సిటీకి చెందిన లిజ్ షియాంగ్ తెలిపారు. పొగతాగడం, ఉప్పు అధికంగా వాడటం వంటి జీవనశైలి కారణాలతో పాటు హైబీపీ, అధిక బీఎంఐ వంటివి స్ట్రోక్ ముప్పును పెంచుతున్నాయని అన్నారు.ఈ అధ్యయనం చేపట్టేందుకు 1990 నుంచి 2019 వరకూ గ్లోబల్ హెల్త్ డేటా ఎక్స్ఛేంజ్‌కు చెందిన డేటాను పరిశోధకులు విశ్లేషించారు. ప్రపంచ జనాభా పెరుగుదలతో పాటు స్ట్రోక్ మరణాలు కూడా ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. పొగతాగడం, ఉప్పు వాడకం, హైబీపీ, హైకొలెస్ట్రాల్, కిడ్నీ వ్యాధులు, మధుమేహం, అధిక బీఎంఐ వంటి ఏడు ముప్పు కారకాలతో స్ట్రోక్ మరణాలు పెరుగుతున్నాయని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ ముప్పు కారకాలను నివారించకుంటే స్ట్రోక్ మరణాలు 64 లక్షలకు చేరతాయని పరిశోధకులు స్పష్టం చేశారు.

## ఈ గింజలు పోషకాలకు నిలయం.. మీరూ తింటున్నారా..?

తోటకూర గింజలను ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో ప్రధాన ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. ఈ గింజల్లో అనేక రకాల పోషకాలుంటాయి. అందుకే ఈ గింజలను గ్రెయిన్ ఆఫ్ గాడ్ అని పిలుస్తుంటారు. ఈ గింజల్లో ఉండే పోషకాల గురించి తెలుసుకుందాం.

ఈ గింజల్లో మైక్రో న్యూట్రియంట్లు అధికంగా ఉంటాయి. కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, ఐరన్, మాంగనీస్, జింక్, కాపర్ లాంటి ఖనిజ లవణాలు ఈ విత్తనాల్లో పుష్కలంగా ఉంటాయి.

ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్ పేగుల మీద ప్రీబయోటిక్ ప్రభావాన్ని చూపిస్తాయి. ఫలితంగా పేగుల ఆరోగ్యానికి ఉపయోగపడే షార్ట్ చెయిన్ ఫ్యాటీ యాసిడ్ల సింథసిస్ పెరుగుతుంది.

తోటకూర విత్తనాల్లో ప్రతి 100 గ్రాముల గింజల్లో 13.27 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. మాంసకృత్తుల మీద ఆధారపడిన వారికి అమరాంథ్ చక్కటి ప్రోటీన్ ప్రత్యామ్నాయం కాబట్టి ఈ విత్తనాలను తీసుకోవచ్చు.

ఈ గింజలు తిన్న తర్వాత జీర్ణమయ్యే క్రమంలో పెప్టైడ్స్‌తో శరీరం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రభావానికి లోనవుతుంది. అంతేకాకుండా ఈ విత్తనాల్లో ఉండే బయో యాక్టివ్ పెప్టైడ్ అయినటువంటి లునాసిన్ కేన్సర్ నుంచి రక్షణ కల్పిస్తుంది.తోటకూర విత్తనాల్లోని ఫైటోస్టెరాల్స్ మూలంగా కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణాలను కలిగి ఉంటుంది. కార్డియో వ్యాస్క్యులర్ వ్యాధులున్న వారు వీటిని తప్పక తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## దంచికొడుతున్న ఎండలు.. హార్ట్, కిడ్నీ రోగులు జర జాగ్రత్త..!



తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఇవాళ హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయిలో 49 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మిగతా ప్రాంతాల్లో 45 నుంచి 48 డిగ్రీల మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో గుండె, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న రోగులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.వేడిమి కారణంగా ఉక్కపోత అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో చర్మ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వడదెబ్బ కూడా తగిలే అవకాశం ఉందని, చల్లని ప్రదేశాల్లోనే ఉండాలని సూచిస్తున్నారు. కలుషితమైన ఆహారం, నీటికి దూరంగా ఉండాలని చెబుతున్నారు.ఎండలు బాగా ఉన్న సమయంలో కిడ్నీ, గుండె సంబంధిత రోగులు ఇండ్ల నుంచి బయటకు రావొద్దని వైద్యులు సూచించారు. వీలైనంత వరకు తమ శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుకోవాలని చెప్పారు. సీనియర్ సిటిజెన్లు, షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు బయటకు రావొద్దని వైద్యులు హెచ్చరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

–మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా చూసుకోవాలి.

–తెలుపు రంగు దుస్తులు, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించేలా చూసుకోవాలి.

–బయటకు వెళ్తే.. మంచి నీళ్ల బాటిల్‌ను తీసుకెళ్లాలి.

–వీలైనంత వరకు శుద్ధమైన నీటిని తాగాలి.

–శరీర ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచుకోవాలి.

–వడదెబ్బకు గురి కాకుండా.. చల్లని ప్రదేశాల్లో ఉండాలి.

–ఒక వేళ వడదెబ్బకు గురైతే.. ఆ వ్యక్తికి తక్షణమే ఓఆర్ఎస్ అందించాలి.

–వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలి.

–క్యాప్, సన్ గ్లాసెస్ ధరించాలి.

# ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు

**సాంకేతిక రంగాన్ని రాజీవ్ పరుగులు పెట్టించారు మందావజ్రయ్య**



కంచికచర్ల మే 21 ప్రజా పాలన ప్రతినిధి ఐటీ రంగా న్ని భారతదేశానికి పరిచయం చేసి విప్లవాత్మక మా ర్పులు తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఎన్టీఆర్ జిల్లా ఎస్ సి సెల్ కన్వీనర్ మందా వజ్రయ్య అన్నారు. మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ వ ర్ధంతి సందర్భంగా కంచికచర్ల చెవిటికల్లు సెంటర్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ని వాళి అర్పించారు. అనంతరం డాక్టర్ అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించా రు. ఈ సందర్భంగా మందా వజ్రయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడో పుట్టిన కంప్యూటర్ రంగాన్ని మ న దేశానికి పరిచయం చేసి ఎంతో మంది విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకులనేలా చేసింది రాజీవ్ గాంధీనే అని గుర్తు చేసారు. గ్రామాల అభివృద్ధికి రాజీ వ్ గాంధీ ఎంతగానో కృషి చేశారని, ఐటీ రంగంలో నే డు ఇండియా అగ్రగామిగా ఉందంటే అది రాజీవ్ గాం ధీ కృషి ఫలితమే అన్నారు. అభివృద్ధికోసం ఆఖరు ర క్తపు బొట్టు వరకు దేశం కోసం ప్రాణాలు అర్పించార న్నారని,దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దే శాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత రాజీవ్ గాంధీదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రో లి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్ప టికి మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ కార్యదర్శి వేముల జ యరాజ్, ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కూచి పూడి మోహనరావు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూదుల పూర్ణచంద్రరావు నాగులు మీరా గోగినేని వెం కటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## గడపగడపకు మన ప్రభుత్వం ఏర్పాట్లను సిద్ధం చేస్తున్న కారంపూడి వైసీపీ నాయకులు



కారంపూడి...మే21...ప్రజాపాలన... ప్రతినిధి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ నెల 25వ తేదీ నుండి కారంపూడిలో మాచర్ల ఎమ్మెల్యే జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్ పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి చేపట్టానున్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మీడియాకు వెల్లడించారు. 25వ తేది సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ముందుగా పల్నాడు ప్రజల ఆరాధ్య దైవమైన అంకళమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి పూజలు నిర్వహించి ఈ కార్యక్రమన్ని ప్రారంభిస్తారని కారంపూడి మేజర్ పంచాయతీ కావటంతో సుమారు 15 రోజులు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా అనేది తెలుసుకొని ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు అందిన సంక్షేమ పథకాల జాబితాను కరపత్రం రూపంలో ఎమ్మెల్యే పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి స్వయంగా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల జాబితాను వివరించటం జరుగుతుందని అలాగే గ్రామంలో ముఖ్యమైన సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్యఉద్దేశమని వైసీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమనికి సంబంధించి రూట్ మ్యాప్ ను, ఏర్పాట్లను సిద్ధం చేయటం జరుగుతుందని ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, వాలంటీర్లు పాల్గొని ఈ కార్యక్రమన్ని విజయవంతం చేయాలనీ వైసీపీ నాయకులు కోరుతున్నారు.

## అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఐదవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి.:అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఐదవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చెయ్యాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జగ్గంపూడి రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామంలో మహాసభలను జయప్రదం చేయాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంపూడి రాజు మాట్లాడుతూ మే నెల 25వ తేదీన అనకాపల్లిలోని కామ్రేడ్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ప్రాంగణంలో జరిగే ఐదవ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నాగులపల్లి అచ్చరావు, నాగులపల్లి రమణ, గుమ్మడి రాంబాబు, కోరుకొండ మరిడమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలలో ఆసక్తికర సన్నివేశం

**ఎంపీ కేశినేని నాని ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ పనితీరును మెచ్చుకున్నవైనం**




నందిగామ మే 21 ప్రజాపాలన ప్రతినిధి : చందర్లపాడు మండలం తోటరావులపాడుగ్రామంలో ఎంపీ నిధులు తో రూ.47.00 లక్షల రూపాయలతో నిర్మించిన 90 వే ల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ట్యాంక్ను ప్రారంభోత్సవానికి కేశినేని శ్రీనివాస్ (నాని) తో పాటు వైసిపి ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు పా ల్గొన్నారు. అయితే ఈ ఓవర్హెడ్ ట్యాంక్ నిధులు కేవ లం ఎంపీ నిధులనుంచి మంజూరయ్యాయి సాధార ణంగా ఒక పార్టీ ఎంపీ మరొక పార్టీ ఎమ్మెల్యే ఒకే స్టే జిని పంచుకోవడం అరుదుగా జరుగుతాయి ఒకవేళ జరిగిన ఎవరి వాదన వారు వినిపించుకొని వెళ్ళిపో తున్న సందర్భాలే ఎక్కువ శాతం మనకు దర్శనమి స్తూ ఉంటాయి కానీ తోటరావులుపాడు గ్రామంలో జరిగిన అరుదైన సంఘటన ఏమనగా ఎమ్మెల్యే ప నితీరును ఎంపీ మెచ్చుకోవడం ఆసక్తికరమైన సన్నివే శం. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూప్రజాసేవ కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషి ని నాలుగేళ్లుగా నేను చూస్తున్న దానిలో భాగంగానే అభివృద్ధి కోసం ఎంపీ నిధులు కేటాయిస్తా ఇంకా ఏదై నా ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కు కు సహకరిస్తానన్నారురాజ కీయాలు ఎలక్షన్ వరకు పరిమితమైతే బాగుంటుంద న్నారుగత నాలుగేళ్లుగా నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా వైసీపీ ఎమ్మెల్యే వైసీపీ ఎమ్మెల్సీ అ రుణ్ కుమార్ వెంటనే వెంటనే స్పందిచి పరిష్కరిస్తా రన్నారుపార్టీలు వేరైనా ఈ ప్రాంతం అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేస్తాం అన్నారుప్రజాహితం కోరు కునే పార్టీ నాయకులు ఏ పార్టీ అయినా సరే పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలుతెలిపారు

## డొంక రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



చందర్లపాడు మే 21 ప్రజాపాలన ప్రతినిధి మండలప రిధిలోని కాంద్రపాడు గ్రామంలో మండల పరిషత్ ని ధులు రూ.2 లక్షల అంచనా వ్యయంతో పంట పొలా లకు వెళ్లే కుమ్మరి వాగు డొంక అభివృద్ధి పనులకు శా సనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు ఆది వారం శంకుస్థాపన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంద్రపాడు గ్రామంలో నుంచి కోనాయపాలెం గ్రామం మధ్యలో గల పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గతం లో రైతుల తమ దృష్టికి తీసుకువచ్చారని, రైతుల స మస్యలు పరిష్కరించేందుకే డొంక రోడ్డు అభివృద్ధి ప నులు చేపట్టామని తెలిపారు. రైతులు వ్యవసాయం చేసుకునేందుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు,వ్యవసాయయంత్రపరికరాలు,రైతులవ్యవసాయ వాహనాలు పంట పొలాలకు తీసుకువెళ్లేందు కు అనువుగా డొంక రోడ్డును అభివృద్ధి చేస్తు న్నామ న్నారుఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మ హమ్మద్ మస్తాన్, గ్రామ పార్టీ కన్వీనర్ కొండా కృష్ణా రెడ్డి, సర్పంచ్ గుగులోతు లక్ష్మీ, సొసైటీ చైర్మన్ కమ తం నర్సిరెడ్డి, యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, గ్రా మ రైతులు తదితరులు పాల్గొన్నారు

## 17 వ వార్డులో “గడపగడపకు- మన ప్రభుత్వం కార్య క్రమంలో ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ మే 21 ప్రజా పాలన ప్రతినిధి పట్టణంలోని 17 వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిం చారు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యల గు రించి అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేశారు ఈ కార్యక్రమంలో భాగంగా ఆయ న మాట్లాడుతూమా హాయంలో పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలో వైయస్ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్ ఏ ర్పాటు చేశామన్నారు. కాలనీ వాసులకు చేరువలో నే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం మన్నారు17 వ వార్డు పరిధిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠ శా ల అభివృద్ధికి నాడు -నేడు నిధులు కేటాయించాం కా లనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీ సుకుంటున్నామని తెలిపారుఅందరికీ మంచి చేయా లనే తలంపుతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి అండగా నిలవాలని ప్రజలను కోరినారుఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి చల్లా బ్రహ్మం, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, కౌన్సిలర్లు బాపట్ల సాంబయ్య, తానూరి రా ము, ఏఈ ఫణి శ్రీనివాస్, వార్డు ఇంచార్జ్ పట్టా శ్రీను, బండారు వెంకటరావు, విశ్వనాథపల్లి కృపారావు, మే చర్ల విజయలక్ష్మి, పూలపొంగు పోతురాజు, బండారు శేషు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఆధ్వర్యంలో బీసీల ఐక్య కార్యచరణ రౌండ్ టేబుల్ సమావేశం

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు**




గుంటూరు జిల్లా. గుంటూరు. మే 21 (ప్రజాపాలన ప్రతినిధి): గుంటూరు నగరంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ఐక్య కార్యచరణ రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర టీడీపీ నాయకులతోపాటు నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డా.చదలవాడ మాట్లాడుతూ.....బీసీ సంఘాలన్నీ ఒక్కటై రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.జగన్మోహన్ రెడ్డి నిధులు లేని 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కార్పొరేషన్ చైర్మన్ లకు విధులు లేకుండా బీసీల నాయకత్వాన్ని జగన్ రెడ్డి బలహీనపరిచారని ఆరోపించారు.చంద్రబాబు నాయుడు ఆదరణ లాంటి పథకాలతో బీసీలలోని కులవృత్తుల వారికి పనిముట్లు అందించి కుల వృత్తులను ప్రోత్సహించారన్న విషయాన్ని గుర్తు చేశారు.జగన్ రెడ్డి కార్పొరేషన్ నిధులను సంక్షేమ పథకాలకు మళ్లించి వెనుకబడిన బీసీ వర్గాల అభివృద్ధిని పాతి పెట్టారని మండిపడ్డారు.తెలుగుదేశం పార్టీలో బలమైన బీసీ నాయకులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుండాలు పొట్టన పెట్టుకుంటున్నారని బీసీలంతా ఏకమై వైసీపీ గుండా రాజకీయాలకు బుద్ధి చెప్పాలన్నారు.బీసీలకు మెడికల్ సీట్లలో రిజర్వేషన్ల కోసం ఆలా వెంకటేశ్వర కేంద్ర,రాష్ట్ర స్థాయిలో పోరాటం చేసి దామాస ప్రకారం సీట్లు కేటాయింపుకు చేసిన కృషి మరువలేనిదని ప్రశంసించారు.కుల సంఘాలు,బీసీ సంఘాలు, బీసీల అభ్యున్నతి కోసం రాష్ట్ర భవిష్యత్తు కోసం పాటుపడుతున్నాయన్నారు.పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బీసీ నాయకులు అవకాశమిస్తే పదివేల మందితో బీసీ సదస్సు ఏర్పాటు చేస్తానని డా.చదలవాడ అరవింద బాబు బీసీ నాయకులు కోరారు.బీసీ కులానికి చెందిన తనకు నరసరావుపేట అసెంబ్లీ స్థానాన్ని ఎన్నికలకు 15 రోజుల ముందే కేటాయించారని కొన్ని కారణాల వల్ల ఓడిపోయానన్నారు.ఓటమిని ఛాలెంజ్ గా తీసుకొని ఓడిపోయిన చోటే గెలవాలని ఓడిపోయిన రెండో రోజు నుంచే ప్రజల్లోకి వెళుతున్నానని ప్రజలు బాగా ఆదరిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.పోలీసుల దొంగ కేసులకు,వైసీపీ గుండాల బెదిరింపులకు భయపడకుండా ప్రజల మద్దతుతో నరసరావుపేట నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అవినీతి,అక్రమాలపై పోరాటం చేస్తున్నానన్నారు.ప్రజల మద్దతుతో 2024 ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని ఓడిస్తానని అన్నారు.

# బుజ్జగింపులు కాదు.. బెదిరింపులే..

మచిలీపట్నం మే 21 ప్రజాపాలన :ఈ నెల 22న సోమవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జిల్లా ప్రధాన కేంద్రమైన మచిలీపట్నంలో బందరు డీప్ వాటర్ పోర్ట్ పనులను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం విచ్చేయనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అఖండ స్వాగతం పలకడానికి నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజలు అనేక సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పోర్ట్ పనులు ప్రారంభోత్సవానికి జగన్మోహన్ రెడ్డి వస్తున్నారు కనుక పోర్టు పనులు వేగంగా జరుగుతాయని ఆశిస్తున్నారు, జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభ కు వేలాది మందిని సమీకరించడానికి నాయకులు తంటాలు పడుతున్నారు. ఈ సభను జయప్రదం చేయడం కోసమని డ్వాక్రా మహిళలను, వాలంటీర్లను, సచివాలయ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. నగరం లోని ఒక డ్వాక్రా గ్రూప్ లిడర్ తన గ్రూప్ పరిధి లో ఉన్న సభ్యురాలు అయితే దాదాపు 300 మంది డ్వాక్రా గ్రూప్ మహిళలను తప్పనిసరిగా జగన్మోహన్ రెడ్డి సభకు రావాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. అయితే డ్వాక్రా గ్రూప్ సభ్యులు మాత్రం బహిరంగ సభకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. దాంతో ఆ లీడర్ ఎట్టి పరిస్థితిలో నైనా బహిరంగ సభకు రావలసిందే నని, రాని ఎడల మీకు వచ్చే , లోన్లు,రుణమాఫీ లు రాకుండా చేస్తామని బెదిరించింది. తన గ్రూప్ పరిధిలో ఉన్న 300 మంది లో తొమ్మిది మంది మాత్రమే జగన్ బహిరంగ సభకు రావడానికి సుముఖత వ్యక్తం చేయగా ఆ గ్రూప్ లీడర్ సభ్యుల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మున్సిపల్ అధికారుల ఒత్తిడితో తాను తప్పనిసరిగా గ్రూప్ సభ్యులను ఆ గ్రూప్ లిడర్ హెచ్చరించడం కొసమెరుపు. మచిలీపట్నం నియోజవర్గం లో మచిలీపట్నం నగరంలో 50 డివిజన్ లో ఉండగా ఒక్కో డివిజన్ పరిధిలో ఉన్న వాలంటీర్ ముగ్గురు మహిళలను చొప్పున సమీకరించాలని ఆదేశాలిచ్చారు. దీనితో వాలంటీర్లు ఇంటింటికి తిరిగి జగన్మోహన్ రెడ్డి సభకు తప్పకుండా రావలసినదిగా కోరుతున్నారు.భహిరంగసభకి వచ్చే మహిళలల్ని వాహనాలలో సభాస్థలికి తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పెడన మున్సిపాలిటీలో కూడా ఇదే తంతు జరుగుతోంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని నాని , పేర్ని కిట్టు తో సహా ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు కూడా జగన్మోహన్ రెడ్డి సంతోష పడే విధంగా ఆద్యంతం కృషి చేస్తున్నారు. నిన్నటి వరకు ఉండమ్మా బొట్టు పెడతా అంటూ ఇంటింటికి తిరిగి న వాలంటీర్లు ,సిబ్బంది , మహిళా కార్యకర్తలు ఇప్పుడు జన సమీకరణ తో సభాస్థలికి తీసుకురావడానికి పాట్లు పడుతున్నారు. ఈ జన సమీకరణ ఎంత వరకు సఫలీకృతం అవుతారో చూడాలి.

## 632 రోజులుగా కొనసాగుతున్న ఉచిత రక్తదానం మహా యజ్ఞం




జగ్గయ్యపేట మే 21 ప్రజాపాలన ప్రతినిధి పట్టణం లోని గత 632 రోజులుగా ఉ చిత మెగా రక్తదాన మ హా యజ్ఞం కొనసాగుతూ వస్తుంది ఈ మహా యజ్ఞం లో చాలామందికి రక్తాన్ని ఇచ్చి అనేకమంది ప్రాణాల ను కాపాడుతున్న వైనం ఇక్కడ మనం చూడవచ్చు. రక్త దానం అనగా ఒక ప్రాణాన్ని నిలబెట్టినట్టే లెక్క ఆది వారం పట్టణంలోని జె.భూపతి బ్లడ్ డోనార్స్ ఆ ధ్వర్యంలో లోకల్ సాయి సహకారంతో బిపాజిటివ్ రక్త శాతం తక్కువ ఉన్న వ్యక్తికి జగ్గయ్యపేట పట్టణం లో ని ప్రైవేటు హాస్పిటల్ లో మొదటి సారి రక్తదానం చే సి మానవత్వం చాటుకున్నాడురక్తదానంచేసినభూ పతిని రక్తం పొందిన వ్యక్తి ,తన కుటుంబ సభ్యులు ధ న్యవాదాలు తెలిపారు. జగ్గయ్యపేట బ్లడ్ డోనార్స్ సభ్యులు ధన్యవాదాలు,అభినందించారు.రక్తదాతల కోసం చిలుకూరి కార్తీక్,మోటమర్రి లక్ష్మి శ్రీ,పబ్బతి న రేంద్ర,వి మణికంఠ, గడ్డం అశోక్ తదితరులు సహక రించారు

## రౌడీ షీటర్లకు మార్పు రావాలి.. ప్రజాశాంతికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు

**నరసరావుపేట డిఎస్పి కేవీ మహేష్**



పల్నాడు జిల్లా .నరసరావుపేట. మే 21 (ప్రజాపాలన ప్రతినిధి): రౌడీ షీటర్లు తీరు మార్చుకోవాలని ప్రజాశాంతికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట డిఎస్పీ కెవి. మహేష్ హెచ్చరించారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఆదివారం డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు వివాదాలకు పాల్పడినా ప్రోత్సహించినా ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే రౌడీ షీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందని సత్ప్రవర్తనతో మెలుగుతూ తీరు మార్చుకొని పోలీసులకు ఇన్ఫార్మర్లు గా వ్యవహరించాలని సూచించారు. గత అనుభవాలను మరిచి మళ్ళీ మళ్ళీ తప్పులు చేయకుండా క్రమశిక్షణగా ఉంటూ సమాజంలో గౌరవ ప్రదంగా ఉండాలని మంచి నడవడికతో మసులుకుంటే కొన్నేళ్లకు రౌడీషీట్ కొట్టివేయడం జరుగుతుందన్నారు. పల్నాడు ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు రౌడీ షీటర్లకు డిఎస్పీ కార్యాలయంలో ప్రతి నెలా కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## ప్రముఖ సంగీత దర్శకుడు రాజ్ కన్నుమూత!




తెలుగు సినీ పరిశ్రమలో సంగీత దర్శకుడు రాజ్ ఎన్నో విజయాలను సాధించారు. మ్యూజిక్ డైరెక్టర్ కోటి తో కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు సంగీతం అందించారు. అయితే, ఆయన తాజాగా కూకట్ పల్లిలోని తన నివాసం లో గుండెపోటు తో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య మరియు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.సంగీత దర్శకుడు రాజ్ మృతి పట్ల అభిమానులు, సినీ పరిశ్రమ కి చెందిన ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కోటి నుండి విడిపోయాక రాజ్ పలు చిత్రాలకు సంగీతం అందించారు. ఎందరో సినీ అభిమానులు మనసు దోచుకున్నారు రాజ్.

## అందుకే 15 కోట్లు పెట్టి సినిమా చేశా!



సీనియర్ యాక్టర్ నరేష్ ప్రస్తుతం టాలీవుడ్ లో ఫుల్ బిజీ నటుడిగా కొనసాగుతున్నారు. స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకొని తండ్రి పాత్రలకి కేరాఫ్ అడ్రెస్ గా మారిపోయాడు. అతని నుంచి కావాల్సినంత ఫన్ జెనరేట్ కావడంతో ఎక్కువగా జోవియల్ ఫాదర్ రోల్స్ కి నరేష్ ని ఎంపిక చేస్తున్నారు.ఇదిలా ఉంటే ఉంటే చాలా రోజుల తర్వాత లీడ్ రోల్ లో నరేష్ ఓ సినిమా చేస్తున్నాడు. విజయ్ కృష్ణ ప్రొడక్షన్స్ పై ఈ సినిమాని కూడా నరేష్ నిర్మిస్తూ ఉ ండటం విశేషం. ఎంఎస్ రాజు దర్శకత్వంలో మళ్ళీ పెళ్లి టైటిల్ తో ఈ మూవీ తెరకెక్కించారు. ప్రస్తుతం ఈ చిత్రం రిలీజ్ కి రెడీ అవుతోంది. నరేష్ కి జోడీగా మళ్ళీ పెళ్లి మూవీలో పవిత్రా లోకేష్ నటిస్తోన్న సంగతి తెలిసిందే.ఇక వీరిద్దరి వ్యవహారం గత కొంతకాలంగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. లివింగ్ రిలేషన్ లో ఉన్న వీరిద్దరిపై నరేష్ మాజీ భార్య రమ్య రఘుపతి విమర్శలు చేయడం అలాగే మైసూర్ లో హోటల్ లో ఉంటే వెళ్లి హడావిడి చేయడం జరిగింది. ఇక సోషల్ మీడియాలో కూడా నరేష్ పవిత్ర లోకేష్ వ్యవహారం సెన్సేషన్ గా మారింది.తన చుట్టూ జరిగిన సంఘటనలని ఇతివృత్తంగా తీసుకొని నరేష్ మళ్ళీ పెళ్లి సినిమా చేశారు. తాజాగా ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా సినిమాపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మళ్ళీ పెళ్లి అనేది నా జీవితానికి మాత్రమే సంబందించినది కాదని చెప్పారు. సొసైటీలో చాలా మంది జీవితాలకి దగ్గరగా ఉంటుందని అన్నారు. వివాహ వ్యవస్థ మీద గౌరవం ఉన్న సరైన జీవిత భాగస్వామిలు లేకపోతే ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ఈ చిత్రంలో చూపించడం జరిగిందని అన్నారు.ఎవరి మీదనో రివేజ్ కోసం 15 కోట్లు పెట్టి రెండు భాషలలో సినిమా చేసే అవసరం నాకు లేదు. వాటికోసం యుట్యూబ్ లు సోషల్ మీడియా ఉంది. అయితే ఒక వ్యక్తి ప్రమేయం వలన ఇవన్నీ వచ్చాయి. పరిస్థితుల ప్రభావంతో విడాకులకి అప్లై చేశాను. తరువాత వారు మా బంధాన్ని బ్రేక్ చేయాలని చాశారు. ఆ సమయంలో కూడా నన్ను నమ్మి పవిత్ర నా వెంట నిలబడింది. అలాంటి పవిత్రకి ప్రాణం ఉన్నంత వరకు తోడుగా ఉంటాను. మాకు తెలిసి మా పెళ్లి మనసులు ముడిపడి ఇప్పటికే అయిపొయింది. సమయం బట్టి శాస్త్రోక్తంగా పెళ్లి చేసుకుంటాం అని నరేష్ చెప్పుకొచ్చారు. ఇక పవిత్ర లోకేష్ మాట్లాడుతూ మా ఇద్దరి మధ్య ఉన్న పాజిటివిటీ ఒకరిని ఒకరికి దగ్గర చేసింది. ఎవరో మీదనో రివెంజ్ తీర్చుకోవాలనే ఆలోచన మాకు లేదు. ట్రోలింగ్ విమర్శలు వచ్చినపుడు నరేష్ నాకు అండగా నిలబడ్డారు. ఆయనతోనే నా బంధం ముడిపడి ఉంది అని పేర్కొన్నారు. ఇప్పుడు వీరిద్దరూ ఇచ్చిన ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.

## 'అఖండ 2' పై క్రేజీ అప్ డేట్ !





యాక్షన్ డైరెక్టర్ బోయపాటి శ్రీను బాలయ్యతో అఖండ సినిమా తీసి సూపర్ హిట్ కొట్టాడు. అందుకే, ఈ సినిమా సీక్వెల్ కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే, కొన్ని నెలల క్రితం, 'అఖండ 2' కచ్చితంగా ఉంటుందని బాలయ్య ప్రకటించాడు. ఈ నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ పై ఓ రూమర్ వినిపిస్తోంది. నవంబర్ నుంచి ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరుపుకుని షూటింగ్ కి వెళ్తుంది అని టాక్ నడుస్తోంది. అలాగే జూన్ 10, 2023న బాలయ్య పుట్టినరోజును పురస్కరించుకుని 'అఖండ 2' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని తెలుస్తోంది. ఇక అఖండ 2 లో పొలిటికల్ అంశాలే మెయిన్ హైలైట్ గా ఉంటాయట. అన్నట్టు 'అఖండ 2' సినిమాలో కూడా బాలయ్య ద్విపాత్రాభినయం చేయబోతున్నాడు. బాలయ్య చేయనున్న రెండు పాత్రల్లో చాలా వేరియేషన్స్ ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా బాలయ్య బాడీ లాంగ్వేజ్ కి సరిపడే సరికొత్త స్టోరీతో బోయపాటి ఈ సినిమా కథని ప్లాన్ చేశాడట. అఖండ సీక్వెల్ కావడంతో.. ఈ సినిమా పై భారీ అంచనాలు ఉంటాయి. బోయపాటి శ్రీను ప్రస్తుతం హీరో రామ్ తో ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.

## శర్వా పెళ్లికి అంత ఖర్చా.. వామ్మో?



తెలుగు సినీ ఇండస్ట్రీలో తనదైన విలక్షణమైన నటన విభిన్నమై చిత్రాలతో ప్రత్యేకమైన ఇమేజ్ను సొంతం చేసుకున్నాడు యంగ్ హీరో శర్వానంద్. హిట్లు ఫ్లాపులతో సంబంధం లేకుండా కెరీర్ను సక్సెస్ఫుల్గా ముందుకు తీసుకు వెళ్తోన్న అతడు.. పర్సనల్ లైఫ్ను కూడా వివాహం బంధంతో విజయవంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోన్న విషయం తెలిసిందే.శర్వానంద్ గత జనవరిలో రక్షిత రెడ్డి అనే అమ్మాయితో నిశ్చితార్థం చేసుకుని సర్ప్రైజ్ చేశాడు. కానీ ఆ తర్వాత అతడి పెళ్లి ఊసు అస్సలు వినిపించలేదు. దీంతో ఈ యంగ్ హీరో ఎంగేజ్మెంట్ బ్రేకప్ అయిపోయిందని వార్తలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో రక్షితతో శర్వానంద్ వివాహం జూన్ 2న జరగబోతుందని న్యూస్ లీకైంది. దీంతో అతడి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.సాధారణంగా సినీ రంగానికి చెందిన సెలెబ్రిటీలు డెస్టినేషన్ వెడ్డింగ్స్ చేసుకోడానికి ఇష్టపడుతుంటారు. అందుకు అనుగుణంగానే ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ కూడా తన పెళ్లి వేడుకను ప్లాన్ చేసుకున్నాడు.రక్షితతో అతడి పెళ్లి జూన్ 3వ తేదీన జరగబోతుంది. ఇందుకోసం రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్లో ఉన్న లీలా ప్యాలెస్ను వేదికగా నిర్ణయించుకున్నారు.శర్వానంద్ – రక్షిత రెడ్డిల వివాహం జైపూర్లోని ప్యాలెస్లో రెండు రోజుల పాటు జరగబోతుంది. జూన్ 2వ తేదీన మెహందీ ఫంక్షన్ జరుపుతారు. ఆ తర్వాతి రోజు ఉదయాన్నే అతడిని పెళ్లి కొడుకును చేస్తారు. అనంతరం ఆరోజు రాత్రి 11 గంటలకు శర్వా తనకు కాబోయే భార్య మెడలో మూడు ముళ్లు వేస్తాడన్న మాట. ఈ పెళ్లికి అతి తక్కువ మంది మాత్రమే హాజరు కాబోతున్నారు. ఇదిలా ఉండగా.. శర్వానంద్ పెళ్లి కోసం భారీగానే ఖర్చు చేస్తున్నట్లు తాజాగా ఓ న్యూస్ లీకైంది. అతడి పెళ్లి జరగనున్న ప్యాలెస్కు ఒక్క రోజుకు రూ. 4 కోట్లు చెల్లించాల్సి ఉంటుందట. అలాగే ప్రయాణ ఖర్చులతో పాటు మెహందీ సంగీత్లకు కలిపి దాదాపు రూ. 10 కోట్లు ఖర్చు చేస్తున్నాడని తెలిసింది. దీంతో ఇప్పుడు శర్వా పెళ్లి నేషనల్ వైడ్గా హాట్ టాపిక్గా మారిపోయింది.

## ప్రభాస్ జెట్ స్పీడ్.. ఓ పనైపోయింది




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు లైన్ లో పెట్టి షూటింగ్ లు కంప్లీట్ చేస్తున్నారు. ఓ వైపు ఆదిపురుష్ మూవీ జూన్ 16న రిలీజ్ కి రెడీ అవుతోంది. దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఈ మూవీ కోసం ఎదురుచూస్తున్నారు. మరో వైపు ప్రశాంత్ నీల్ సలార్ షూటింగ్ ని కంప్లీట్ చేసే పనిలో ప్రభాస్ ఉన్నాడు. ఈ నెల ఆఖరుకి సలార్ షూటింగ్ పోర్తయ్యే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది.అలాగే ప్రాజెక్ట్ కె మూవీ షూటింగ్ పెండింగ్ లో ఉంది. ఇప్పటి వరకు ఈ మూవీ 75 శాతం కంప్లీట్ అయ్యిందంట. దీంతో పాటు మారుతి దర్శకత్వంలో రాజా డీలాక్స్ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. రొమాంటిక్ కామెడీ హర్రర్ థ్రిల్లర్ జోనర్ లో ఈ మూవీ తెరకెక్కుతోంది. కంప్లీట్ గా ఒక బంగ్లా బ్యాక్ డ్రాప్ లోనే ఈ సినిమా కథ మొత్తం ఉంటుంది.ఈ సినిమాలో మాళవిక మోహనన్ నిధి అగర్వాల్ ఆషికా రంగనాథ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ మూడు షెడ్యూల్స్ కంప్లీట్ అయ్యాయి. ఇదిలా ఉంటే వచ్చే నెలలో రాజా డీలాక్స్ షూటింగ్ కంప్లీట్ చేయనున్నారని తెలుస్తోంది. తాజాగా దీనికి సంబంధించి అప్డేట్ బయటకొచ్చింది.వచ్చే నెలలో లాంగ్ షెడ్యూల్ రాజా డీలాక్స్ షూటింగ్ జరగనుందని దాంతో మొత్తం టాకీ పార్ట్ కంప్లీట్ అవుతుందని టాక్. అయితే ఈ మూవీ షూటింగ్ మొత్తం సింగిల్ లొకేషన్ లో చేసిన విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో షూటింగ్ కంప్లీట్ అయిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ పై మారుతి దృష్టి పెట్టనున్నారని ఇండస్ట్రీ వర్గాల మాట. వచ్చే ఏడాది వేసవిలో సినిమాని రిలీజ్ చేయాలని మారుతి లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. ఇక రాజా డీలాక్స్ షూటింగ్ కంప్లీట్ చేసిన తర్వాత నాగ్ అశ్విన్ దర్శకత్వంలో చేస్తోన్న ప్రాజెక్ట్ కె కోసం జాయిన్ అవుతారని సమాచారం. ఆ సినిమా కూడా ఓ వైపు షూటింగ్ జరుపుకుంటూనే మరో వైపు విజువల్ ఎఫెక్ట్స్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పనిని కూడా పూర్తి చేసుకుంటుంది.

## "టైగర్ నాగేశ్వరరావు" కోసం వెంకీమామ.!




మాస్ మహారాజ రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా సినిమా "టైగర్ నాగేశ్వరరావు" కోసం తెలిసిందే. దర్శకుడు మహేష్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాలు అయితే నెలకొల్పుకోగా ఈ సినిమా ఫస్ట్ లుక్ కోసమే మేకర్స్ సాలిడ్ ప్లానింగ్ లు చేస్తున్నారు.అలా సినిమా ఫస్ట్ లుక్ ని పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కి సిద్ధం చేస్తుండగా ఆల్రెడీ తెలుగు మినహా మిగతా భాషల్లో ప్రముఖ ముఖ్య స్టార్స్ తో ఈ ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేస్తుండగా లేటెస్ట్ గా అయితే తెలుగులో ఎవరు రిలీజ్ చేస్తున్నారో మేకర్స్ కన్ఫర్మ్ చేశారు.మరి ఈ లుక్ కోసం అందరి ఫేవరెట్ హీరో వెంకీ మామ అయితే మేకర్స్ తీసుకున్నారు. తాను ఈ అవైటెడ్ లుక్ ని తన వాయిస్ ఓవర్ తో అయితే పరిచయం చేయనున్నట్టుగా మేకర్స్ ఇప్పుడు తెలిపారు. దీనితో వెంకీ మామ తన అగ్రెసివ్ వాయిస్ లో టైగర్ నాగేశ్వరరావు ని పరిచయం చేయడం ఎలా ఉంటుందో చూడాలి.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com